మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం, 23 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 29 పేజీలు: 12 వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

కుంభమేళాలో ప్రసాదం పంపిణీ చేసిన సుధామూర్తి

సామాజిక వేత్త, రచయిత్రి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి మహాకుంభ మేళాలో పాల్గొన్నారు. తన మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఇస్కాన్ క్యాంపును సందర్శించి భక్తులకు మహా ప్రసాదాన్ని వడ్డించారు. ఈ మహా కుంభమేళాను ఆమె 'తీర్థరాజ్'గా అభివర్ణించారు.

ఇండియా గ్రాండ్ విక్టరీ

వివరాలు.. స్పోర్ట్స్ పేజీలో

రవాణాలో పెట్టుబడులు పెట్టండి

దావోస్‌లో పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసున్నం 2

మౌలిక సదుపాయాలన్నీ సమకూరుస్తున్నం

కాలుష్య నియంత్రణకు ఈవీ పాలసీ తెచ్చినం

నగరాల అభివృద్ధికి అర్బన్ మొబిలిటీ ఎంతో కీలకం. తక్కువ టైంలో ఎక్కువ దూరం చేరుకోగలిగే ట్రాన్స్‌పోర్ట్ ఫెసిలిటీ కలిగిన మహా నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయి.. ఇందు కోసమే తెలంగాణలో ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్, మెట్రోతో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీగా.. నెట్ జీరో పాల్యూటెడ్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం. ఈ బృహత్తర కార్యక్రమానికి అందరూ కలిసి రావాలి.. నిర్మాణంలో పాలుపంచుకోవాలని సీఎం రేవంత్ దావోస్‌లో ఇన్వెస్టర్లకు విజ్ఞప్తి చేశారు.

సివిల్స్ నోటిఫికేషన్

ఢిల్లీ, జనవరి 22 (మనం న్యూస్)ః యూపీఎస్సీ, 2025 సంవత్సరపు సివిల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అఖిల భారత సర్వీసుల్లో దాదాపు 979 పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. 2025 పరీక్షకు జనవరి 22 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రిలిమినరీ ...మిగతా 2లో

ఐఐఎంలో ఐదేండ్ల లా కోర్సు

ఇండోర్, జనవరి 22 (మనం న్యూస్)ః మేనేజ్‌మెంట్ కోర్సులను ఆఫర్ చేస్తున్న వాటిలో ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా పేరు పొందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు ఇప్పుడు.. ...మిగతా 2లో

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః దేశవ్యాప్తంగా మొదలైన జేఈఈ మెయిన్ పరీక్షలకు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. హైదరాబాద్లో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ వల్ల కొద్ది పాటి ...మిగతా 2లో

తిరుపతి తొక్కిసలాటపై న్యాయ విచారణ

విజయవాడ, జనవరి 22 (మనం న్యూస్)ః తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశించింది. ఘటనపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఈ ...మిగతా 2లో

కిడ్నీ రాకెట్‌పై నివేదిక!

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విచారణ కొనసాగుతోంది. డాక్టర్ నాగేంద్ర ...మిగతా 2లో

చూడముచ్చటైన చిత్రం..

ఒకే వేదికపై ముగ్గురు ముఖ్యమంత్రులు 2

- రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు, రేవంత్, ఫడ్నవీస్
- అభివృద్ధి, టెక్నాలజీలను ఇచ్చిపుచ్చుకోవడంపై చర్చ

ఇన్వెస్ట్‌మెంట్ జాక్‌పాట్ కొట్టిన రేవంత్

సన్ పెట్రోకెమికల్స్‌తో రూ.45,500 కోట్ల అగ్రిమెంట్ 2

యువ కాంగీయుల కొట్లాట

తన్నుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు

పిడి గుద్దులు.. మారంమారీ.. తోపులాటలు.. తోడ్‌పోడ్‌లు

- నినాదాలు.. ప్రతి నినాదాలతో దద్దరిల్లిన గాంధీ భవన్
- బీఆర్ఎస్ నుంచి వచ్చినోళ్లకే పదవులిస్తుండ్రని ఒక వర్గం దాడి

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు రెచ్చిపోయారు. కొత్తగూడెంకు చెందిన యూత్ కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారికే పదవులు వస్తున్నాయంటూ ఒక వర్గానికి చెందిన నేతలు మరో వర్గం నేతలపై దాడికి దిగడంతో గాంధీభవన్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. అక్కడ ఉన్న నాయకులు సముదాయించినప్పటికీ వినకుండా మరీ ఘర్షణకు దిగారు. రెండు వర్గాల వారు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు నినాదాలు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొత్తగూడెం ...మిగతా 2లో

మహారాష్ట్రలో రైలు ప్రమాదం..

12 మంది దుర్మరణం

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

40 మందికి పైగా తీవ్ర గాయాలు

దుర్ఘటన కలిచివేసిందిః సీఎం ఫడ్నవీస్ విచారం

ముంబై, జనవరి 22 (మనం న్యూస్)ః మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ (లక్నో-ముంబయి ఎక్స్‌ప్రెస్) రైలు ప్రయాణికుల మీద నుంచి మరో రైలు దూసుకుపోయిన ఘటనలో ఇప్పటివరకు 12 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 40మంది వరకూ గాయపడ్డారు. బుధవారం సాయంత్రం 5గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వ్యాపించినట్టు వదంతులు వ్యాపించగా.. భయంతో ప్రయాణికులు చైను లాగి పట్టాలపై దిగారు. వెనుకాముందు చూసుకోకుండా వారు హడావుడిగా పట్టాలు దాటుతున్న క్రమంలో పచోరా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి వారిని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనపై తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు రేగాయని అధికారి ఒకరు చెప్పారు. దీంతో ప్రయాణికులు ...మిగతా 2లో

మీ సమస్యలు పరిష్కరిస్తం.. విద్యా విలువలు పెంపొందించండి 2

- నూతన పోకడలను బట్టి అధ్యాపకులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలె
- టీజీసీజీటీఏ డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వి. ప్రకాశ్‌ను విచారించిన కమిషన్

101వ సాక్షిగా ప్రకాశ్

స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరానికి మార్పుపై కమిషన్ ప్రశ్నించిందన్న ప్రకాశ్ 2

గ్రామసభలా.. ఖాకీ క్యాంప్‌లా?

మీరు చెప్పిన ప్రజా పాలన ఇదేనా?

మీ మాటల గారడీపై జనగర్జన షురువైంది

గ్రామ సభలపై కేటీఆర్ కామెంట్స్ 2

ఆప్ V/s బీజేపీ

మేనిఫెస్టో వార్

మధ్య తరగతి ఎజెండాతో ఆప్.. యూత్ టార్గెట్‌గా బీజేపీ హామీ పత్రాల విడుదల

ఢిల్లీః దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ఓటర్లకు హామీల వలలు విసురుతున్నాయి. ఈ క్రమంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ 'మధ్యతరగతి మ్యానిఫెస్టో' పేరుతో తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఈ పాటికే తన మేనిఫెస్టోను విడుదల చేసిన బీజేపీ 'సంకల్ప పత్రం' పేరుతో ...మిగతా 2లో

గ్రామ సభల్లో ఆందోళనలు.. అధికారుల తీరుపై ఆగ్రహాలు

- అధికారులను నిలదీస్తున్న ప్రజలు, ప్రభుత్వ తీరుపై నిరసన
- కొత్త పథకాల లబ్ధిదారుల ఎంపిక ఆగమాగం

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల కోసం గ్రామ సభలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి ఎంపిక ...మిగతా 2లో

సెల్ఫీతో చిక్కిన చిత్రం..

అగ్రనేత ప్రాణాలు తీసిన సెల్ఫీ

ఆజాద్ ఫోన్‌లో గల.. భార్యతో దిగిన సెల్ఫీ ఫోటోతో చలపతిని గుర్తించిన పోలీసులు 2

రవాణాలో పెట్టుబడి పెట్టండి

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలను కోరారు. రవాణా రంగంలో పెట్టుబడులతో ముందుకు రండి, ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. బుధవారం దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, సీఐఐ, హీరో మోటార్స్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన,పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని ఆహ్వానించారు. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అనీ, ఇందులో భాగంగానే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రోతో ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామనీ, పర్యావరణహితంగా నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. తెలంగాణ డ్రై పోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామనీ, రాష్ట్రానికి తీర ప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానించనున్నట్లు సీఎం రేవంత్ వెల్లడించారు.

హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉందనీ, దాదాపు 100 కి.మీ.కు పైగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నామనీ, ఇప్పుడున్న దాని కంటే ఇది రెండింతలు ఎక్కువని వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ.ల మేర ఔటర్ రింగ్ రోడ్డు ఉందనీ, దాని వెలుపల 360 కి.మీ.ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామనీ, ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే, రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైన్ నిర్మించాలనే ఆలోచన ఉందన్నారు. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాది వేస్తుందన్నారు. తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదనీ, ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణానికి అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని అందుకే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు.

ఒకే వేదికపై ముగ్గురు ముఖ్యమంత్రులు

హైదరాబాద్ 22, (మనం న్యూస్)ః దావోస్‌లో పెట్టుబడుల కోసం తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర మధ్య రేస్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో దావోస్‌లో బుధవారం ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఒకే వేదికను పంచుకున్నారు. దావోస్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా దేశం, తమ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాలపై చర్చించారు. అలాగే, తమ రాష్ట్రాల్లో అభివృద్ధి పథకాల అమలుకు సంబంధించి వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, కొత్త ఉద్యోగ అవకాశాల కల్పన, ఆర్థిక వ్యవస్థ, ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్థిరత్వం, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలు వంటి పలు అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో ముగ్గురు సీఎంలు కీలక చర్చలు జరిపారు. ఇప్పటికే తమ రాష్ట్రాల్లో పెట్టుబడులను ఆకర్షించడం కోసం తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు నిర్వహిస్తుండగా, పలు కంపెనీలు ఈ దిశగా ముందుకు వచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో కంపెనీలు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయి. మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ సైతం తమ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చే దిశగా శాయశక్తులా కృషి చేస్తున్నారు. కాగా, దావోస్‌లో ముగ్గురు సీఎంల భేటీపై వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో టీమిండియా అంటూ ఏపీ సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా ఫోటో షేర్ చేయడం విశేషం.

హెచ్‌సీఎల్ సీఈవోతో సీఎం భేటీ

హైదరాబాద్ 22, (మనం న్యూస్)ః దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి హెచ్‌సిఎల్ సీఈవో విజయ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. హైటెక్ సిటీలో హెసిఎల్ 3.2 లక్షల చదరపు అడుగుల్లో క్యాంపస్ నిర్మిస్తోంది. కొత్త క్యాంపస్‌తో 5 వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఫిబ్రవరిలో దీన్ని ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డిని హెసిఎల్ ఎండీ కోరారు. తెలంగాణలో ఆ సంస్థ సేవల విస్తరణను సీఎం స్వాగతించారు. నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో మరో కంపెనీ భారీ పెట్టుబడికి ఎంవోయూ కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ కంపెనీ అంగీకారం తెలిపింది. దీంతో 3600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీదర్ సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. ఈ డాటా సెంటర్ రాష్ట్రంలో మరో మైలురాయి కానుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

ఇన్వెస్ట్‌మెంట్ జాక్‌పాట్ కొట్టిన రేవంత్

హైదరాబాద్ః రాష్ట్రంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన సాగుతోంది. అందులోభాగంగా వరల్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో మరో భారీ పెట్టుబడిని తెలంగాణ ప్రభుత్వం సాధించింది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. రూ. 45,500 కోట్ల పెట్టుబడులకు సన్ పెట్రోకెమికల్స్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. దీంతో తెలంగాణలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందంతో దాదాపు 7,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.ఈ ప్రాజెక్టును నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో అతి భారీ ఒప్పందం ఇదే కావడం గమనార్హం. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుధవారం మరో కీలక ఒప్పందం కుదుర్చుకొంది.

జేఎస్‌డబ్ల్యూ 800 కోట్ల ఒప్పందం

రాష్ట్రంలో అధునాతన అన్‌మ్యాన్‌డ్ ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్ట్.. రూ.800 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ప్రకటించింది. జేఎస్డబ్ల్యు డిఫెన్స్ అనుబంధ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుతో డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారే అవకాశముందని చర్చ ఊపందుకొంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతోందిఈ సదస్సు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం రేవంతరెడ్డి సారథ్యంలో పలువురు మంత్రులు ఉన్నతాధికారులు దావోస్ బయలుదేరి వెళ్లారు. ఆ క్రమంలో ఇప్పటికే పలు ప్రాజెక్టను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి.

సివిల్స్ నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష మే 25న జరగనుంది. మరోవైపు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో మరో 150 పోస్టులకు విడిగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు సైతం ఫిబ్రవరి 11వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు

విద్యార్హతలు: అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలి.

వయో పరిమితి: అభ్యర్థుల వయసు 21నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా మినహాయింపు ఉంది.

దరఖాస్తు రుసుం: ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100 (మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు)

ప్రిలిమినరీ పరీక్ష: ఇందులో రెండు పేపర్లు (400 మార్కులకు) ఉంటాయి. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ రూపంలో ఇస్తారు. ఈ ప్రశ్నల్లో నెగెటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రిలిమ్స్లో అర్హత సాధించిన అభ్యర్థులను మెయిన్స్ రాసేందుకు అనుమతిస్తారు.

మెయిన్స్ పరీక్ష: ఇది డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది.మెయిన్స్లో సత్తా చాటిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలివే..: విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, హైదరాబాద్, వరంగల్.

ఐఐఎంలో ఐదేండ్ల లా కోర్సు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు అందిస్తున్నాయి. ఐఐఎం రోహ్‌తక్ న్యాయవిద్య కోర్సుకూ శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ లా (ఐపీఎల్) కోర్సులో ప్రవేశానికి ప్రకటన విడుదల చేసింది. పరీక్ష, ఇంటర్వ్యూతో సీట్లు కేటాయిస్తారు. ఐఐఎం రోహ్‌తక్ 2021 నుంచే న్యాయవిద్యలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ ఎల్ఎల్‌బీ కోర్సునూ ఆఫర్ చేస్తున్నది. ఐదేళ్ల కోర్సులో ఏడాదికి 3 చొప్పున 15 టర్ములుంటాయి. ఈ వ్యవధిలో బిజినెస్ మేనేజ్మెంట్, లా, గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కల్పిస్తారు.

ప్రపంచ ప్రమాణాలతో న్యాయవిద్యలో నైపుణ్యం పొందేలా కోర్సు రూపొందించారు.

ఇంటర్నేషనల్ లా, కంపారిటివ్ లా, ఫారిన్ లా, డొమెస్టిక్ లా కోర్సులో భాగం. బిజినెస్ మేనేజ్మెంట్, ఇంటర్నేషనల్ అఫైర్స్, హ్యూమానిటీస్, పబ్లిక్ పాలసీ, ఫారిన్ లాంగ్వేజ్లు కూడా కోర్సులో ఉన్నాయి. ఐదేళ్ల కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి బీబీఏ ఎల్ఎల్బీ డిగ్రీ ప్రదానం చేస్తారు. ఈ కోర్సులో చేరినవారికి ఆగస్టు మూడోవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఐదేళ్ల కోర్సు ఫీజు రూ.32,47,450.

ఎంపిక: క్లాట్ స్కోరు లేదా ఆప్టిట్యూడ్ టెస్టు స్కోరు, ఇంటర్వ్యూలతో.

క్లాట్-2025 స్కోరుతో దరఖాస్తు చేసుకోవచ్చు. క్లాట్ రాయనివాళ్లు, అందులో మెరుగైన స్కోరు దక్కనివారు ఆప్టిట్యూడ్ టెస్టు రాసుకోవచ్చు.

ఆప్టిట్యూడ్ టెస్టు

ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లీగల్ రీజనింగ్లో ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్-1లో.. క్వాంటిటేటివ్ అబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ అబిలిటీ ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. సెక్షన్-2లో లీగల్ రీజనింగ్లో 20 ప్రశ్నలు అడుగుతారు. వ్యవధి 20 నిమిషాలు.

అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే. సరైన సమాధానానికి 4 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

క్లాట్ స్కోరు లేదా ఆప్టిట్యూడ్ టెస్టు మార్కుల ప్రకారం కొంతమందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మే చివరి వారంలో అర్హత పొందినవారి వివరాలు ప్రకటిస్తారు. వీరికి జూన్ మొదటి లేదా రెండోవారంలో ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అకడమిక్స్, జనరల్ అవేర్నెస్, కమ్యూనికేషన్ స్కిల్స్ పరిశీలిస్తారు.

వెయిటే

ఆప్టిట్యూడ్ టెస్టు మార్కులు లేదా క్లాట్ స్కోరుకు 55 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ 15 శాతం, పాస్ట్ అకడమిక్స్ 30 (పదో తరగతికి 10, ఇంటర్మీడియట్కు 20) శాతం వెయిటేజీ ఉంటాయి. వీటన్నిటి ప్రకారం తుది ఎంపిక చేపడతారు. ఈ ఫలితాలు జులై రెండో వారంలో వెలువడతాయి.

అర్హతలుః

ఎదోతరగతి, ఇంటర్మీడియట్లో కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 55 శాతం సరిపోతాయి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: జూన్ 30, 2025 నాటికి 20 ఏళ్లకు మించరాదు.

క్లాట్ స్కోరుతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 19

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్టు కోసం: ఫిబ్రవరి 6 నుంచి ఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు ఫీజు: రూ.4937.

పరీక్ష తేదీ: మే 5

అగ్రనేత ప్రాణాలు తీసిన సెల్ఫీ

హైదరాబాద్, మనం ప్రతినిధిః ఛత్తీస్‌గఢ్ -ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 20 మంది వరకు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే.. కేంద్ర, రాష్ట్ర పోలీసులు జరిపిన జాయింట్ ఆపరేషన్‌లో మృతి చెందిన వారిలో సీనియర్ మావోయిస్ట్ లీడర్ జయరాం రెడ్డి అలియాస్ చలపతి కూడా ఉన్నాడు. అయితే, చలపతి దశాబ్దాలుగా పోలీసుల నుంచి తప్పించుకుంటున్నాడు. కానీ, తన భార్య అరుణ అలియాస్ చైతన్యతో కలిసి దిగిన సెల్ఫీ.. అతని ప్రాణాల మీదకు తెచ్చింది. గతంలో 2008 ఫిబ్రవరిలో ఒడిశాలోని నయాగఢ్ జిల్లాలో జరిగిన దాడిలో 13 మంది పోలీసులు మృతి చెందారు. ఈ ఘటన మాస్టర్ మైండ్ చలపతిగా గుర్తించిన పోలీసులు.. అతని తలపై రూ.1 కోటి రివార్డ్ ప్రకటించారు. అయితే చలపతి ఎలా ఉంటాడో చాలా రోజుల వరకు బయటకు ఎవరికి తెలియరాలేదు. 2016 వరకు అతని ఫొటోలు కూడా పోలీసులకు లభించలేదు.

చలపతి భార్య అరుణ కూడా మావోయిస్ట్ నాయకురాలే. అరుణ ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ డిప్యూటీ కమాండర్‌గా పని చేసింది. ఆ సమయంలో తన భర్తతో కలిసి సెల్ఫీ తీసుకుంది. ఈ సెల్ఫీయే చలపతి రూపురేఖలను గుర్తించడంలో పోలీసులకు సహాయపడిందని చర్చించుకుంటున్నారు. అరుణ.. తన భర్త చలపతితో దిగిన సెల్ఫీని సోదరుడైన ఆజాద్‌కు పంపించింది. 2016లో ఏపీలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్ట్ ఆజాద్ చనిపోయాడు. అ సమయంలో ఆజాద్ స్మార్ట్ ఫోన్ కూడా పోలీసుల చేతికి చిక్కింది. అప్పుడే చలపతి ఎలా ఉంటాడనే విషయం పోలీసులకు తెలిసింది. అప్పుడు పోలీసులు అతని తలకు రూ.1 కోటి రివార్డును కూడా ప్రకటించారు.

మేనిఫెస్టో వార్

(మొదటి పేజీ తరువాయి)

మేనిఫెస్టో రెండో భాగాన్ని విడుదల చేసింది. దీనితో రాజధాని రాజకీయ పంచాతిలో మేనిఫెస్టో వార్ మొదలైనట్టు భావించాలి.

బుధవారం ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన పార్టీ మధ్య తరగతి మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా 'భారతదేశంలోని మధ్యతరగతి ప్రజలు పన్నుల భారంతో నలిగిపోతున్నారు. పన్ను తీవ్రవాదులకు వారు బాధితులగా మారిపోయి.. అధికంగా పన్నులు చెల్లిస్తున్నారు. ప్రతిఫలంగా తక్కువ ప్రయోజనాలు మాత్రమే పొందుతున్నారు' అని కేజ్రీవాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వృద్ధులకు మెరుగైన వైద్యం, సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంగానే తాము సంజీవని పథకాన్ని ప్రారంభించామని ఆయన గుర్తుచేశారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును తిరిగి వారి సంక్షేమానికి వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కానీ, వాటిని పలువురు ఉచితాలంటూ విమర్శిస్తున్నారు. 'విదేశాల్లో ఇలాంటి పథకాలు అమలు చేస్తే మనం మెచ్చుకుంటాం. అదే మన దేశంలో చేస్తే ఉచితాలని విమర్శిస్తాం. ప్రజల సొమ్మును వారి ప్రయోజనాలకు వినియోగిస్తే.. దేశం అభివృద్ధి చెందుతుంది' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

మేనిఫెస్టోలోని ఏడు డిమాండ్లు

1. విద్యకు ప్రవేశపెట్టే బడ్జెట్‌ను 2 శాతం నుంచి 10 శాతానికి పెంచడం. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ
2. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు రాయితీలు
3. ఆరోగ్య బడ్జెట్‌ను 10 శాతానికి పెంచడం. ఆరోగ్య బీమాపై పన్ను ఎత్తివేయడం
4. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.7 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపు
5. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తొలగింపు
6. సీనియర్ సిటిజన్స్ కోసం మరింత మెరుగైన పింఛను పథకాలు
7. రైల్వేలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ కల్పించడం

సంకల్ప పత్రం.. పార్ట్ 2

దేశ రాజధానిలో ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ప్రయత్నంలో ఉన్న భాజపా యువతే లక్ష్యంగా తన మేనిఫెస్టో రెండో భాగాన్ని విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు 'సంకల్ప పత్రం' రెండో భాగాన్ని మంగళవారం భాజపా సీనియర్ నేత అనురాగ్ ఠాకుర్ విడుదల చేశారు.

ముఖ్యాంశాలు..

- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, రాష్ట్ర పీసీఎస్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రెండో ప్రయత్నం వరకు రూ.15వేల ఆర్థిక సాయం.
- అంబేడ్కర్ స్టైఫండ్ పథకం కింద ఐటీఐ, పాలిటెక్నిక్ నైపుణ్య కేంద్రాల్లో సాంకేతిక కోర్సులు అభ్యసించే షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రతి నెలా రూ.1,000.
- ఆటో-ట్యాక్సీ డ్రైవర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు. డ్రైవర్లకు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా.
- అవే ప్రయోజనాలతో గృహ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రణాళిక.
- ఆప్ ప్రభుత్వ అక్రమాలు, మోసాలపై దర్యాప్తు చేయడానికి సిట్ ఏర్పాటు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదురైనాయి. 23, 24, 28, 29 తేదీల్లో ఎన్ఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి పేపర్-1 నిర్వహిస్తారు. చివరి రోజు 30న బీఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల కోసం పేపర్-2 జరుగుతుంది. దేశవ్యాప్తంగా రెండు పేపర్లకు కలిపి 12 లక్షల మందికిపైగా దరఖాస్తు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్షన్నర మంది హాజరవుతున్నారు.

తిరుపతి తొక్కిసలాటపై న్యాయ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. జనవరి 8న తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందగా.. పలువురు భక్తులు గాయపడిన విషయం తెలిసిందే.

కిడ్నీ రాకెట్‌పై నివేదిక!

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ.. కిడ్నీ దాతలు, గ్రహీతలతో మాట్లాడుతున్నారు. ఈ కమిటీ బుధవారం సాయంత్రం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. విచారణ సందర్భంగా డీఎంఈ వాణి మాట్లాడుతూ.. ''కిడ్నీ దాతలు పూర్ణిమ అనే మహిళ పేరు ప్రస్తావించారు. కుటుంబ, ఆర్థిక కారణాలతో కిడ్నీలు ఇచ్చేందుకు అంగీకరించినట్టు చెప్పారు. కిడ్నీలు ఇచ్చిన ఇద్దరు మహిళలు కూడా వితంతువులే. కిడ్నీ దాతలు, గ్రహీతలు తమిళం, కన్నడ మాట్లాడుతున్నారు. ఇతర రాష్ట్రాలకి చెందిన వారిని రాష్ట్రానికి తీసుకొచ్చి కిడ్నీ రాకెట్ నిర్వహిస్తున్నారు. అలకనంద ఆస్పత్రికి సంబంధించి ఒక ప్లాస్టిక్ సర్జన్కు మాత్రమే గుర్తింపు ఉంది. వాస్తవంగా ఆ ప్లాస్టిక్ సర్జనే ఈ కిడ్నీ శస్త్ర చికిత్సలు చేశారా? లేదా అని ఆరా తీస్తున్నాం.

విద్యా విలువలు పెంపొందించండి

హైదరాబాద్, జనవరి 22 (మనం న్యూస్)ః ప్రభుత్వ కళాశాలల్లో వస్తున్న నూతన పోకడలకు అనుగుణంగా అధ్యాపకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం (టీజీసీజీటీఏ) నూతన సంవత్సర డైరీని డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందనీ, క్రమంగా అన్ని సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్నిపూర్తిగా నిర్లక్ష్యం చేసిందనీ, గాడి తప్పిన విద్యా వ్యవస్థను తిరిగి సరైన పద్ధతిలో నడిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగానే విద్యా వ్యవస్థ పటిష్టతను పలు చర్యలు చేపట్టిందనీ, విద్యారంగంలో అనుభవజ్ఞులైన వారి సలహాలు, సూచనలతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల స్థితిగతులు, అడ్మిషన్లు తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పటిష్టత కోసం తమ సంఘం చేస్తున్న కృషి అడ్మిషన్లు పెంచడంలో, కళాశాలల్లో విద్యా విలువలు పెంపొందించడంలో అధ్యాపకులు పాటుపడుతున్న తీరును టీజీసీ జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె. సురేందర్ రెడ్డి వివరించారు. అనంతరం అధ్యాపకుల ప్రధాన సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కండీషన్ మీద ప్రమోషన్ పొందిన అధ్యాపకుల సమస్య సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి ఆ ఫైలు స్థితిగతులపై భట్టి సంబంధిత శాఖ అధికారులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె.సురేందర్ రెడ్డి, బెల్లి యాదయ్య, మహిళా కార్యదర్శి డా.పావని, రాష్ట్ర కార్యవర్గసభ్యులు డా.తిరుపతయ్య, డా.మహేష్, డా.రాజారాం తదితరులు పాల్గొన్నారు.

తన్నుకున్న యూత్ కాంగ్రెస్ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీలో గత కొద్ది రోజులుగా పార్టీ పదవుల నియామకం జరుగుతోంది. అయితే, బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారికే పదవులు దక్కుతున్నాయంటూ మరో వర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో గాంధీభవన్‌కు కాంగ్రెస్ పెద్దలను కలవడానికి వచ్చిన కొత్తగూడెం యూత్ కాంగ్రెస్ నేతలు అక్కడే బాహాబాహీకి దిగారు. దీంతో ఘర్షణకు దిగిన ఇరు వర్గాల నేతలను పోలీసులు చెదరగొట్టారు. కాగా, గాంధీభవన్ వేదికగా యూత్ కాంగ్రెస్ నేతలు ఫైర్ అవడంపై సీనియర్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోకుండా ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే గొడవకు దిగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల బీజేపీ నేత బిదూరీ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీపై అనుచిత విమర్శలు చేశారంటూ యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు.

12 మంది దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

భయాందోళనకు గురై చైన్ లాగి ట్రాక్‌లపై దూకేసిన సమయంలో కర్ణాటక ఎక్స్‌

ఏసియన్ రాధిక థియేటర్లో ప్రేక్షకులకు కుచ్చుటోపి

- తినుబండారాలపై భారీగా వసూళ్లు.
- లిఫ్టు వెళ్లేటప్పుడే వినియోగం వచ్చేటప్పుడు మెట్ల దారి మాత్రమే..
- వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలకు తీవ్ర అవస్థలు..
- సినిమా క్యాంటీన్ తినే వస్తువుల మెనూ ఒకటి, అమ్మేది మరొకటి.
- ప్రేక్షకుల జేబులు కాళీ చేస్తున్న యాజమాన్యం..
- అన్నిస్క్రీన్ లకు ఒకే పార్కింగ్ స్థలం ..
- ప్రేక్షకుల బాధలు పట్టించుకోని యాజమాన్యం..

కాప్రా, జనవరి 22 (మనం న్యూస్) : రాధిక ఏషియన్ థియేటర్లో ప్రేక్షకుల నుండి భారీ మొత్తంలో క్యాంటీన్ తిను బండారులపై వసూలు చేస్తున్నారని పలువురు ప్రేక్షకులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే అందరికీ దగ్గరలో ఉన్న రాధిక ఏషియన్ మాల్, ప్రేక్షకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సినిమా హాల్లో నుండి స్క్రీన్ వద్దకు వెళ్లేటప్పుడు లిఫ్టును ఉపయోగిస్తున్నారు. సినిమా ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో లిఫ్టును వాడకుండా సెక్యూరిటీలు పక్కకు నెట్టడం పట్ల వృద్ధులు చిన్నపిల్లలు గర్భిణీలు, వికలాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పార్కింగ్ స్థలంలో కూడా చోటు లేకుండా అన్ని స్క్రీన్ లకు ఒకే పార్కింగ్ పెట్టడం చేత వాహనాలు పార్కింగ్ చేసే సమయంలో, తీసేటప్పుడు ప్రేక్షకులు ఇబ్బందులతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అరకొర సిబ్బందితో ప్రేక్షకులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. సినిమా విశ్రాంతి సమయంలో దరల పట్టికపై ఉన్న రేట్లకు మించి ఎక్కువ మొత్తంలో ప్రేక్షకుల నుండి వసూలు చేస్తున్నారు. ధరలు నియంత్రించ వలసిన ప్రభుత్వ అధికారులు యజమాన్యంతో ఒప్పందమయ్యారు అని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టికెట్ ధరలు పెంచవద్దని తెలిపిన, కోర్టుల నుంచి ఆర్డర్లు తెచ్చుకొని మరీ సినిమాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధరలు నియంత్రణ లేకపోవడంతో ప్రజలపై అధిక ధరలు సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త సినిమాలు వచ్చినప్పుడు మూడు స్క్రీన్ లలో ఆడే ఆటలకు వచ్చే ప్రేక్షకులకు పార్కింగ్ కనీస సౌకర్యం ఏర్పాటు చేయక పార్కింగ్ సిబ్బందిని తగినంత పెట్టకుండా ప్రేక్షకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి సినిమా హాళ్లపై అధికారులు నిఘా ఉంచి ప్రజలకు కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని కోరుతున్నారు. సినిమా హాలుకు వెళ్లే వారిలో మధ్యతరగతి పేద కుటుంబీకులే ఎక్కువగా ఉంటారు, ఇలా వెళ్లే పేద ప్రజలకు మధ్యతరగతి ప్రజలకు ధరలు అందుబాటులో లేక పిల్లలకు ఇప్పించలేక ఇబ్బందులు పడుతున్నారు, ఇబ్బంది పెట్టే సినిమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, నాయకులు ప్రజా సంఘాలు కోరుతున్నారు.

12 గ్రామాలతో చేవెళ్ల ను మున్సిపల్ గా ఎర్పాటు చేయాలి

- మండల బిజెపి అధ్యక్షులు అనంతరెడ్డి.

చేవెళ్ల, జనవరి 22(మనం న్యూస్) : ముందుగా ప్రకటించిన 12 గ్రామాలతో చేవెళ్లను మున్సిపల్ గా ఎర్పాటు చేయాలని మండల బిజెపి అధ్యక్షులు అనంతరెడ్డి డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....చేవెళ్ల మున్సిపల్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని అయితే మున్సిపల్లో పలు గ్రామాల విలీనం సక్రమంగా జరగడం లేదన్నారు. ఊరేళ్ల, మల్కాపూర్ గ్రామాలు ఇంకా పల్లెలుగానే ఉన్నాయని, ఊరేళ్లలో సుమారు 300 మంది ఉపాధి హామీ కూలీలున్నారని మున్సిపల్ లో విలీనంతో ఇక్కడ ఉపాధి కోల్పోయి కూలీలు రోడ్డున పడే అవకాశముందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఊరేళ్ల, మల్కాపూర్ లో మైనార్టీల ఓట్లు అధికంగా ఉన్నాయని బిజెపికి భయపడి మున్సిపల్ లో కలిపారని తెలిపారు. దేశ. రాష్ట్ర వ్యాప్తంగా చేవెళ్లకు ఎంతో పేరుందన్నారు. చిన్న మున్సిపాలిటీగా చేసి చేవెళ్ల అభివృద్ధిలో కుంటుపడేసే విధంగా అధికార కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో బీజేపీ యువ నాయకులు డాక్టర్ ఎం.వైభవ్ రెడ్డి, చేగురి ప్రవీణ్ రెడ్డి, పిసరి శ్రీకాంత్ రెడ్డి, పత్తి సత్యనారాయణ, మల్గారి భార్గవ్ రెడ్డి, ప్రకాష్. జయసింహ, హేమంత్, భాస్కర్, రాజు తదితరులున్నారు.

7వేల కేజీల నల్ల బెల్లం, 40 కేజీ ల పటిక స్వాధీనం

- 3 వాహనాలు, 4 సెల్ ఫోన్ లు సిజ్
- 4 గురు అరెస్టు ఇద్దరు పరారీలో

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్): దాదాపు 7వేల కేజీలకు పైగా నల్ల బెల్లం, 40 కేజీ ల పటిక స్వాధీనం చేసుకొని 4 గురు నీ అరెస్టు చేసిన సంఘటన సరూర్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుదవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కిషన్ మాట్లాడుతూ తెలంగాణలో సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ కమిషనర్ కమలహాసన్ రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించడం తో పహాడి షరీఫ్ లో దాదాపు 7860 కిలోల నల్ల బెల్లం, 40 కిలోల స్పటికమును అక్రమంగా తరలిస్తున్న ముఠాను పట్టుటుకున్నట్లు తెలిపారు. కర్ణాటక నుండి హైదరాబాద్ పహాడి షరీఫ్ కి అక్రమంగా తరలిస్తున్నారు అని అన్నారు.నిందితుల వద్ద నుండి కిలోల 7860 నల్ల బెల్లం, 40 కిలోల స్పటిక, ఒక డీసీఎం, రెండు ఆటోలు, ఒక లక్ష రూ.7 వేల ఐదువందల రూపాయల నగదు, 4 మొబైల్స్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.శివకాంత్, కేతావత్ అరుణ్ నాయక్, సభవాత్ హీర్యా సింగ్, మహమ్మద్ బాబా లను అరెస్ట్ చేసామని, రామవాత్ నరేష్, కేతావాత్ శ్రీను నాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

అలకనంద కాదు...అలక దందా ఆసుపత్రి

- నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన అలకనంద ఆసుపత్రి వైద్యులు
- యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలి

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్):ప్రజల ప్రాణాలను సొమ్ము చేసుకుంటున్న ఆస్పత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడాలి అని రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు లేని ఆస్పత్రులపై డ్రైవ్ చేసి సీజ్ చేయాలి ఏఐవైఎఫ్ డిమాండ్ చేశారు.నిరసనగా అఖిల భారత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో అలకనంద ఆసుపత్రి వద్ద నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలకనంద మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ యాజమాన్యం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు చేపట్టలేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిన్న బాధిత పేషెంట్ లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తే కానీ స్పందించని అధికారుల వైఖరి చూస్తుంటే ఏ స్థాయిలో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో పరోక్షంగా కుమ్మక్కు అవుతున్నారో అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఇతర రాష్ట్రాలు తమిళనాడు, కర్నాటక నుండి లైసెన్స్ లేని జూనియర్ వైద్యులతో ఈ సర్జరీలు చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో దందా చేస్తున్న ఇలాంటి ఆసుపత్రులపై ఉక్కు పాదం మోపాలని వారు డిమాండ్ చేశారు.అలకనంద ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యంను కఠిన సెక్షన్ లు విధించి, రిమాండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగం ద్వారా రాష్ట్ర మంతటా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రిలపై దాడులు చేపట్టాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న వాటిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ,ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, పి. శివ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వీరేశ్, వెంకటేష్, సందీప్, హరి కృష్ణ, గణేశ్, భాను, ప్రకాష్,పాండు, భగత్ సింగ్, సైదులు, శ్రవణ్, కళ్యాణ్, అనీల్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రామిడి రాంరెడ్డి జన్మదిన వేడుకల్లో మెట్రో హాస్పిటల్ యాజమాన్యం

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్): బడంగ్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి జన్మదిన వేడుకల్లో అల్మాస్గూడ మెట్రో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం రమేష్,శ్రీకాంత్,సురేష్,గణేష్, రామారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామ్ రెడ్డి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు సేవ చేసే రామిడి రాంరెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని , భవిష్యత్తులో మంచి పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఓజోన్ హాస్పిటల్ లో ప్రొఫషనల్స్ క్రికెట్ లీగ్ మీడియా సమావేశం

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్):కొత్తపేట ఓజోన్ హాస్పిటల్ ఆడిటోరియంలో ప్రొఫషనల్స్ క్రికెట్ లీగ్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ ప్రొఫెషనల్స్ క్రికెట్ లీగ్ ను జనవరి లో ప్రారంభించి డాక్టర్స్ వర్సెస్ లాయర్స్,పోలీస్ వర్సెస్ లాయర్స్ లీగ్ మ్యాచ్ లు నిర్వహించడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో ప్రొఫషనల్స్ క్రికెట్ లీగ్ ను మొదటగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తదుపరి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామన్నారు.ప్రొఫెషనల్స్ క్రికెట్ లీగ్ కు చైర్మన్ గా డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ డి వి రావు,కమిటీ సభ్యులు గా డాక్టర్ మధుసూదన్ రెడ్డి,డాక్టర్ రంజిత్,డాక్టర్ అతీత్ వ్యవహరిస్తున్నారన్నారు.ప్రొఫెషనల్స్ క్రికెట్ లీగ్ ఫిబ్రవరి 26 నుండి ప్రారంభమవుతుందని ప్రొఫెషనల్స్ అందరూ కూడా ఎన్రోల్ చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రణయ శ్రీ ఫుడ్ కోర్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బలాల

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్): సైదాబాద్ జయనగర్ లో రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన శేఖర్ నేతృత్వంలో ప్రణయ శ్రీ ఫుడ్ కోర్ట్ నూతన రెస్టారెంట్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు యాజమాన్యాన్ని అభినందించారు.ప్రణయ శ్రీ ఫుడ్ కోర్ట్ నిర్వాహకులు శేఖర్ మాట్లాడుతూ చికెన్ ఫ్రైడ్ రైస్, నూడిల్స్, చికెన్ 65, మంచూరియా,చికెన్ లాలీపాప్స్ అన్ని రకాల ఫాస్ట్ ఫుడ్ ఐటమ్స్ అందరికీ అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు.ఈ అవకాశాన్ని స్థానికులందరూ వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని 25 ద్విచక్ర వాహనాలు సీజ్

చేవెళ్ల, జనవరి 22(మనం న్యూస్): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని చేవెళ్ల ఎస్ఐ సంతోష్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా చేవెళ్ల పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించి నెంబర్ప్లేట్ లేని 25 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనదారులు తప్ప నిసరిగా నెంబర్ ప్లేట్ అమర్చు కోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచిం చారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల మన్నులను పొందిన ప్రతిభావంతుడు అధికారి రమేష్

- అంగవైకల్యం అడ్డు కాదాని చాటి ఎంతో మందికి స్ఫూర్తిదాయకం
- హయత్ నగర్ డీసీ డా. తిప్పర్తి యాదయ్య

రంగారెడ్డి, జనవరి22(మనం న్యూస్): అంగవైకల్యం అడ్డు కాదని, తన ప్రతిభతో ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని హయత్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ డా. తిప్పర్తి యాదయ్య అన్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో బీసీ డెవలప్మెంట్ అసిస్టెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.రమేష్ హయత్ నగర్ సర్కిల్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణ నిమిత్తం అధికారి రమేష్ గురించి మాట్లాడుతూ... రెండు చేతులు సరిగ్గా లేకున్నా చక్కటి చేతిరాత, తనకు తానే స్వయంగా డ్రైవింగ్ చేయగలిగే ప్రతిభ కలిగిన అధికారి రమేష్ ను అభినందించారు. అవయవాలు అన్ని సరిగ్గా ఉన్నప్పటికీ సోమరిపోతుల వ్యవహరిస్తున్న అలాంటి ఎంతోమందికి అధికారి రమేష్ జీవితం ఆదర్శప్రాయం అని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

సరూర్ నగర్ సరస్సు వద్ద మెగా క్లీన్లీనెస్ డ్రైవ్

రంగారెడ్డి జనవరి 22 (మనం న్యూస్): స్వచ్ఛ్ భారత్ మిషన్ కింద స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి), సరూర్ నగర్ సర్కిల్ ఎల్బి నగర్ జోన్, సర్కిల్ 5 లోని సరూర్ నగర్ సరస్సు వద్ద మెగా క్లీన్లీనెస్ డ్రైవ్ను నిర్వహించింది. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థలు ఈ డ్రైవ్ లో పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో నీటి వనరులను సంరక్షించడంలో సమాజ భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ,ఆకుల శ్రీవాణి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సుజాత, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ 5,. సేవా ఇన్లావత్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ 4 కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలి

- రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి.
- సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ , టై, బెల్ట్, షూస్ ల పంపిణీ.

చేవెళ్ల, జనవరి 22(మనం న్యూస్): విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్ర వల్లి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల(మొత్తం 110మంది)కు దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన సామ రంగారెడ్డి సౌజన్యంతో పాఠశాల అభివృద్ధి కమిటీ సమక్షంలో స్పోర్ట్స్ ,టై, బెల్ట్ ,ఐడికార్డులను రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాతల సహకారం అభినందనీ యమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని సూచించారు. పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వెల్లడించారు. అనంతరం దాత సామ రంగారెడ్డిని గ్రామస్తులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుల తో కలిసి చింపుల సత్యనారాయణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అజాద్ హిందు పౌజ్ .. నేతాజీ

పరమ దేశభక్తుడు, అపర మేధావి, స్వాతంత్ర్య సమర యోధుడు, ధైర్యశాలి, దార్శనికుడు, స్ఫూర్తి ప్రదాత అయిన నేతాజీ సుభాస్ చంద్ర బోస్ భారత స్వతంత్ర పోరాటంలో తనదైన మార్గంలో నడిచి, లక్షల మందిని నడిపించగలిగారు. తన అనుచరులు, అభిమానులు ప్రేమానురాగాలతో 'నేతాజీ'గా పిలుచుకునే సుభాస్ చంద్ర బోస్ ఒడిసా, కటక్‌లో జానకీనాథ్-ప్రభావతి దేవి దంపతులకు 23 జనవరి 1897న జన్మించారు. బాల్యం నుంచే అత్యంత చురుకైన విద్యార్థిగా చదువులు ప్రారంభించి కలకత్తా యూనివర్సిటీ, లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు పూర్తి చేసి ప్రతిష్టాత్మక భారత సివిల్ సర్వీసుకు ఎంపికై ఉద్యోగం ప్రారంభించారు.

సాయుధ పోరాటంతోనే స్వాతంత్ర్యం:

భారత జాతీయ కాంగ్రెస్ నాయకులలో చిత్తరంజన్‌దాస్‌తో ఉన్న సాన్నిహిత్యం వల్ల రాజకీయాలలో ప్రవేశించాడు. చిత్తరంజన్ దాస్ తన రాజకీయ గురువు అని తన ప్రసంగాల్లో పేర్కొనేవాడు. నేతాజీకి మేధాశక్తిని, ఆచరణ దక్షతను గుర్తించిన చిత్తరంజన్ దాస్ మొదట మహాత్మా గాంధీని కలువుమని సూచించాడు. 1921,జులై 16 వ తేదీన బొంబాయి లోని మనీభవంలో మొదటి సారిగా మహాత్మాగాంధీని కలిసాడు. సుభాష్‌కు వ్యక్తిగతంగా గాంధీజీ అంటే అమితమైన గౌరవభావం ఉన్నా,తన భావాలు విప్లవాత్మకంగా ఉండడం,గాంధీజీ అహింసావాదిగా ఉండడంతో వారిరువురి మధ్య అంత సాన్నిహిత్యం పెరగలేదు.

దేశంలో స్వతంత్ర పోరాటాలు ఉధృతం అయిన సమయంలో తన ఉద్యోగాన్ని వదిలి భారత జాతీయ కాంగ్రెస్‌లోచేరి పోరాటంలో చురుకుగా పాల్గొనడం మొదలు పెట్టి 1938-39లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, గాంధీతో విభేధాల కారణంగా ఆ పదవిని వదిలారు. 1939లో 'ఫార్వర్డ్ బ్లాక్' పార్టీకి ఊపిరి పోశారు.1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే అతను ఆంగ్లేయులపై పోరాడేందుకు కూటమి ఏర్పాటు చేసే ఉద్దేశంతో రష్యా, జర్మనీ, జపాను దేశాలలో పర్యటించాడు. జర్మనీ, జపాన్‌ల సహకారం తీసుకొని తనదైన శైలిలో స్వతంత్ర పోరాటం చేయాలని పథకం వేశారు. బ్రిటీష్ వలస పాలనకు చరమగీతం పాడడానికి సాయుధ పోరాటమే ఉత్తమ మార్గమని భావించి ఐక్యత, నమ్మకం, త్యాగం అనే నినాదంతో తనదైన భారత జాతీయ ఆర్మీ (ఆజాద్

హింద్ ఫౌజ్)ని ఏర్పాటు చేసి పోరాటం కొనసాగించారు.

పరాక్రమ దివస్-2025:

భారత ప్రభుత్వం 2021లో తీసుకున్న తీర్మానం ప్రకారం నేతాజీ సుభాస్ చంద్ర బోస్ జయంతిని పరాక్రమ్ దివస్‌గా ప్రతి ఏట 23 జనవరిన పాటించడం ప్రారంభించారు. జై హింద్ అనే అత్యంత ప్రేరణాత్మక నినాదాన్ని అందించిన నేతాజీ సుభాస్ చంద్ర బోస్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు రక్తం ఇవ్వండి, నేను స్వాతంత్ర్యం ఇస్తాను అని పిలుపును ఇవ్వడం విశేషంగా పేర్కొనాలి. నేడు మనం జరుపుకుంటున్న 128వ నేతాజీ సుభాస్ చంద్ర బోస్ జయంతి వేడుకల్లో పాల్గొంటూ ఆయుధ జీవితం నుంచి దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వయం సమృద్ధి, ఉత్తేజిత నాయకత్వాలను నేటి పౌరసమాజం జీర్ణించుకోవలసి ఉంది. తైవాన్ సమీపంలో విమానం కూలిన ఘటనలో 18 ఆగష్టు 1945న మరణించారని ప్రకటనలు చేసినప్పటికీ ఆయన మరణ రహస్యం నేటికీ వివాదంగానే మిగిలింది.

1992 లో సుభాష్ చంద్రబోస్‌కు భారతదేశ అత్యున్నత అవార్డు అయిన 'భారత రత్న'ను మరణానంతరం ఇవ్వటానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది. కానీ దీనిమీద వివాదం కారణంగా 1997 ఆగస్టు 4 న ప్రభుత్వం అవార్డును రద్దు చేసినట్లు ప్రకటించింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేశారు. కటక్‌లో బోసు ఇంటిని సందర్శకులకు మ్యూజియంగా ఏర్పాటు చేశారు.

(నేడు నేతాజీ జన్మదినం)

- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

నవజోష్ చంద్రబోస్

పౌరుషమే తన నైజం
పరాక్రమమే తన ఇజం
దూకుడే తన అస్త్ర
దండెత్తడమే మంత్రం

స్వతంత్ర సాదనే లక్ష్యం
దేశ ఔన్నత్యమే సమస్తం
అతడే నవయుగ జోష్
హిందూ పౌజ్ బిగ్ బాస్
నేతాజీ సుభాష్ చంద్రబోస్

బానిస సంకెళ్ళను తెంచ

సాయుధ పోరెత్తినవాడు
తెల్ల కోటల్ని బద్దలుగొట్ట
పిరింగిలా గర్జించినవాడు
జై హింద్ అనే నినాదంతో
జాతిని కదిలించినవాడు
శత్రుమూకల తరిమికొట్టి
దండుగట్టి దండెత్తినవాడు

గుత్తాధిపత్యపు గుండెల్లో
గుబులు పుట్టించినవాడు
నిర్బంధాలెన్ని ఎదురైనా
రణజెండా దించినివాడు

ఆయుదాన్ని సంధిస్తేనే
స్వరాజ్యం సిద్ధిస్తుందని
నిజంచేసి చూపినవాడు

నవజన స్ఫూర్తి ప్రభాత
భారతీయ గౌరవ పతాక
'సుభాష్ చంద్రబోస్' జీకీ
అఖిల జనత ప్రణామాలు
నిఖిల జగతి నీరాజనాలు

- కోడిగూటి తిరుపతి
9573929493

(జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జయంతి)

మహిళా సాధికారతకు కృషి చేయాలి

మహిళలకు ఓటు హక్కు ఇచ్చే ప్రకటనపై యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా 1920 వ సంవత్సరంలో రాజ్యాంగంలోని 19వ సవరణ ద్వారా తీర్మానం చేసింది. సంవత్సరంలో అప్పటి అమెరికా విదేశాంగ కార్యదర్శి ఐన బై స్ప్రిడ్జే కో ల్టి అమెరికా మహిళలకు రాజ్యాంగపరమైన ఓటు హక్కును ఇచ్చే ప్రకటనపై సంతకం చేసిన రోజు జ్ఞాపకార్థంగా ఆగస్టు 26 తేదీని మహిళా సమానత్వం దినోత్సవం గా తీసుకున్నారు ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా సమ్మె చేశారు. 1971 లో సమానత్వం కోసం పోరాటాలు చేశారు. 1973 లో మహిళల సమాన హక్కులు, సమస్యలపై పోరాటాలు కొనసాగుతున్న సందర్భంలో లో న్యూయార్క్ కు చెందిన కాంగ్రెస్ మహిళ బెళ్ళా అబ్జుగ్ ఆగస్టు 26 మహిళ సమానత్వ దినం జరుపుకొనుటకు తీ ర్మానం ప్రవేశపెట్టగా అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ప్రకటన విడుదల చేశాడు అలా 1973 లో అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపిన తర్వాత మొట్టమొదటి సారిగా సమానత్వ దినాన్ని జరుపుకున్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మద్రాస్ రాష్ట్రం మహిళలకు ఎన్నికల్లో ఓటు హక్కు ను మంజూరు చేసింది. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 లో ప్రస్తావించ బడిన ఈ విధంగా 1950లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలకు ఓటు హక్కు కల్పించబడింది. ప్రపంచంలో జరిగిన కొన్ని సర్వేల ఆధారంగా రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యత తక్కువనే ఉంది. పార్లమెంట్ లో మహిళా ప్రాతినిధ్యం విషయంలో భారతదేశం ప్రపంచంలో 20వ స్థానంలో ఉంది. మహిళా అధ్యక్షులుగా ఎన్నుకొన్న దేశాలను గమనిస్తే, గ్రేట్ బిటన్, జర్మనీ, ఇజ్రాయిల్, భారత్, మరియు డెన్మార్క్ వంటి మరికొన్ని దేశాలు మహిళా అధ్యక్షులను ఎన్ను కున్నాయి. కానీ అమెరికా ఇప్పటివరకు మహిళలను అధ్యక్షులుగా ఎన్నుకోలేదు.మహిళల హక్కుల సాధన కోసం రోసా పార్క్స్, ఎలియనోర్ రూజ్వెల్ట్, మేరీ క్యూరీ, జేన్ గుడాల్ ఇలాంటి మహిళలు సమాజంలో పురుషులు, మహిళలు సమానమని పోరాటం చేశారు. మహిళల ఓటు హక్కు కోసం కాకుండా, విద్య, ఉపాధి అవకాశాల కోసం, రాజకీయాల్లో నిర్వహించడం కోసం పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేసే మహిళలు కోరుకుంటున్న సమస్యలు,, అణచివేత, హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎందుకోసం ఆగస్టు 26 మహిళా సమానత్వం దినోత్సవం సందర్భంగా సెమినార్లు, వర్క్ షాపులు, సదస్సు లు, నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను గుర్తించడం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, బాలికా దినోత్సవం జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన మార్గరెట్ థాచర్, మాక్సిన్ కింగ్, మలాల యూసఫ్ జాయ్ ఇలాంటి నేతలు చరిత్ర ను, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వీర వీర వనితలు, సావిత్రిబాయి పూలే వంటి సంఘ సంస్కర్తలు, పి.టి.ఉష లాంటి క్రీడాకారులు, ఇందిరాగాంధీ లాంటి రాజకీయ నేతల చరిత్ర గురించి నేటి తరం మహిళలకు ఆయా వేదికల ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయాలతోపాటు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తే దేశం పురోగమిస్తుంది అని చెప్పవచ్చును. వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలి. చట్టసభల్లో మహిళలకు తగిన రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచన, ప్రతిపాదనపై అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా రిజర్వేషన్ కు సంబంధించిన బిల్లును 2014లోనే రాజ్యసభ ఆమోదం తెలిపినా , ఆ వెంటనే 15 వ లోక్ సభ రద్దు కావడంతో బిల్లు ఆమోదం పొందలేదు.దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో మీనమేషాలు లెక్కస్తున్నారనీ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. వేద కాలం నుండి ఇ మహిళలను సమానంగా చూసే సంస్కృతి మన దేశానిది. అలాంటిది స్వతంత్రం వచ్చి 74 సంవత్సరాలు గడిచిన మహిళలు ఇంకా వెనుకబడే ఉన్నారు. సమాజంలో కుమార్తె కన్నా, కుమారునికి ప్రాధాన్యం ఇచ్చే పద్ధతులు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. శిశు హత్యలు, బ్రూణ హత్యలు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు లాంటి దురాచారాలు రూపు మాపిన అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని చెప్పవచ్చు. అలాగే ఈ మధ్య హిందూ కుటుంబం ఆస్తి లో కొడుకులతో బాటు, కూతుళ్లకు సమానం హక్కు ఉండదని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. హిందూ వారసత్వ సవరణ చట్టం 2005 కు ముందు తండ్రి మరణించిన కూడా కూతురికి ఆ హక్కులు దక్కుతాయని స్పష్టం చేసింది. పాకిస్తాన్ లో విద్య కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, నోబెల్ బహుమతి గ్రహీత న్యాయవాది, మలాల యూసఫ్ జాయ్ మాటల్లో ప్రపంచం మొత్తం నిశ్శబ్దం గా ఉన్నప్పుడు ఒక స్వరం కూడా శక్తివంతమవుతుంద ని అన్నారు. అందుకే సమాజం నుండి స్త్రీ పురుషుల వివక్షత లేకుండా చూసినప్పు డే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని ఆ దిశగా ప్రభుత్వాలు వారికి అవకాశాలు ఇవ్వాలని పలువురు శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు వివిధ సందర్భాల్లో అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అన్ని రంగాల్లో భాగస్వాములను చేసినప్పుడే మహిళా సమానత్వం సార్థకత అవుతుంది.

- సామంతుల సదానందం
9866136491

అద్దె ఇల్లు ..!

అయోమయం కమ్మేసింది
అదేదో భయం మొదలైంది
ఎప్పుడు యజమానికి కోపం వస్తుందోఅని .

ఎన్ని కలలు కన్నాకూడా
అన్నీ ఆయనకు అనుకూలంగా ఉండాలంట !
ఏమరపాటున కూడా

ఆయన ఆజ్ఞలు ఏమారకూడదంట
శబ్దం లేకుండానే పచ్చడి
పళ్ళెంలోనికి రావాలంట
నీళ్లనెంత పొదుపుగా వాడినా
నీ నిర్లక్ష్యం ఏమిటని
ప్రశ్నల పందేరం పెడతాడంట
కన్నీళ్లు ,సంతోషం ,సంబరాలు
నిశ్శబ్దపు అంబరాన్ని అంటాలంట
నిరాడంబరంగానే నీరు గారిపోవాలంట
ఇన్ని ఆంక్షలు ఎందుకని నోరెత్తితే
రారెత్తి టపుక్కున అద్దె పెంచుతాడంట
పోనీ ఇంకొక చోటికి పోదామనుకొంటే
వారు వీరిని ఏమాత్రం తీసిపోరంట
పక్కనివారి కోపాన్ని పద్దతిగా
అద్దెకున్న వాళ్ళపై అమాంతం వాడుతారంట
ఇంతింత కాదయా ఇల్లు అద్దెకుండు వాళ్ళ
భాదలు
ఇహలోకం లోనే వాళ్ళకు ఇనుములు
ఇబ్బడి ముబ్బడులు ...!

- సింగంపల్లి శేష సాయి కుమార్
8639635907

సుగంధాలు వెదజల్లు

మద్యం మత్తులో
నీ జీవితం ఛిద్రం
ఓ బిడ్డా జర భద్రం
అక్కర్లేదు దానికేగోత్రం

తల్లికి మిగల్చకు శోకం
అదవుతుంది నీ జన్మ పాపం
పడతికి పెద్ద గాయం
నీవు లేవన్న నిజం

నీ దేహానికి అందిన దాహం
చేర్చదు నిన్ను పరలోకం
కుళ్ళిన కంపుతో
చివరికి చేరావు నరకం

అందమైన జీవితాన్ని
పునర్నిర్మించు తక్షణమే...!
జననం సుమధుర ప్రయాణం
సుగంధాలు వెదజల్లు నీ చుట్టూ..!

మత్తులో అవ్వొద్దు చిత్తు
మద్యంతో కుదుర్చుకోకు పొత్తు
దాహాన్ని తీరుస్తూ దేహాన్ని కాల్చుతూ
నీ రూపాన్ని నామరూపాళ్ళేకుండా చేసి

ప్రభుత్వానికి ఖజానా నింపేస్తుంది
నిన్ను బికారిని చేసి,
అమ్మినోడ్ని కుభేరుణ్ణి చేస్తుంది
నిన్ను బానిసను చేసి ఆటాడిస్తుంది

- వాసి జ్యోత్స్న
9866843005

ఓ మనిషీ !

జీవితం అనే
సమస్యల వలయంలో బంధీ నీవు
సంసారం అనే సుడిగుండంలో
చిక్కుకున్న అమాయకుడివి

ఇహలోక పరమార్థం తెలుసుకో ఇకనైనా
స్వార్థం వీడాలి నిస్వార్థం నేర్చుకో
శాశ్వతం కాని దేహంపై
మోహం దేనికి ఆలోచించి
అడుగు ముందుకు వెయ్
పదిమందికీ మేలు చెయ్
కీడు తల పెట్టకు
అప్పుడు అన్నింటా విజయం నీదే.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర
6300546700.

ఎడిట్ పేజీ కోసం మీ మీ వ్యాసాలు, సామాజిక విశ్లేషణలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

– ఎడిటర్

అనాలోచిత పరువు హత్యలు

కంప్యూటర్ యుగంలోనూ కుల రక్కసి పెరిగిపోయిందనడానికి ఏటికేడు పెరుగుతున్న పరువు హత్యల లెక్కలే భయటపెడుతున్నాయి. ఎంతో పరిణతి పొందిన సాంకేతిక యుగంలోనూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నందునే కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయి. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 70 ఏళ్ల కిందటే హిందూ సమాజం పయనిస్తుంది ప్రగతి పథం దిశగానా... తిరోగమనం దిశగానా అన్నారు. వివాహం చట్టబద్దం కావాలంటే వధువు, వరుడు ఇద్దరూ ఒకే కులానికి చెందిన వారు కావాలన్న షరతు బిల్లు వాయిదా వేయడం, సిద్ధాంతాలతో రాజీపడేది లేదంటూ అంబేద్కర్ రాజీనామా చేశారు. అనంతరం 1955లో ఒకే కులం వారైతేనే చట్టబద్ధత అన్న షరతు లేకుండానే హిందూ వివాహ చట్టం అమలులోకి వచ్చింది.

కులాంతర వివాహం చేసుకుని, కులరక్కసికి బలైన తక్కువ కులాలకు చెందిన వారు, అగ్రకులస్థులను పెళ్లి చేసుకోవడం నేరమా? కింది కులాల వాళ్లు ప్రేమించకూడదా? ఒకవేళ ప్రేమిస్తే వారికి మరణశాసమేనా? ప్రేమకు దళితులు అర్హులు కాదా? ఇలా అనేక ప్రశ్నలను బాధితులు సమాజం సమాధానం చెప్పాలి. భూస్వామ్య ప్రభావం అధికంగా ఉన్న ఉత్తర భారతదేశానికే పరితమైన పరువు హత్యలు.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు పాకాయి. పరువు కోసం తండ్రులు ఎంతకైనా తెగిస్తున్నారు. మానవత్వం మరిచి రాక్షసులుగా ప్రవర్తిస్తున్నారు. కొందరికి మమత, మానవత కంటే పరువు ప్రతిష్టలే ఎక్కువైపోతున్నాయి. పరువు కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. సంతోషంగా మనస్సుకు నచ్చిన వారిని పెళ్ళి చేసుకొని హాయిగా సాగిపోతున్న వాళ్లను చూసి ఆనందించాల్సిన కుటుంబ సభ్యులే పగ పెంచుకుని రగిలిపోయారు. తమ మాట కాదని ప్రేమ పెళ్లి చేసుకున్నాడని కుతకుతలాడిపోయారు. మానవత్వం మంట గలిసేలా హతమార్చేందుకు వెనుకాడలేదు.

అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురును తమ కులానికే చెందిన ఒక పెద్దింటి అబ్బాయికి ఇచ్చి అంగరంగ వైభవంగా పెళ్లి చేయాలనేదే తండ్రి చిరకాల కోరిక. అందుకు అనుగుణంగా ఎన్నో కలలు కంటాడు. కూతురు పుట్టినప్పటి నుంచే తన కలను తీర్చుకునేందుకు ప్రణాళికలు రచించుకుంటారు. అయితే ఆ కలలను కూతుళ్లు చిదిమేస్తూ తమ ఇష్టానుసారంగా తన కులానికి బాహ్యంగా ఉన్న వ్యక్తితో పెళ్ళి చేసుకున్నప్పుడు కులాంతర వివాహం చేసుకున్నందుకు ఆడపిల్లల తల్లిదండ్రులు తమ కూతుళ్లకు ఇచ్చే విలువైన కానుకగా ఆమె భర్త ప్రాణాలు తీస్తున్నారు. మూడుముళ్లతో నిండు నూరేండ్లు కలిసి ఉండాలనుకున్న ఆ దంపతుల ఆశలు ఆవిరవుతున్నాయి. కొత్త జీవితం కలలు సాకారం కాకముందే వారి ప్రాణాలు అనంతవాయువుల్లో కలుస్తున్నాయి. కులాంతర వివాహం చేసుకున్న వారి జీవితాలు మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్నది. ఆదరించాల్సిన వాళ్లే వధువు కాళ్ల పారాణి ఆరకముందే వరుడిని మాయం చేస్తున్నారు. ప్రేమించి పెండ్లి చేసుకున్న ఆడపిల్ల జీవితం ఏమవుతుందో అని చూడకుండా ''కుల''పిచ్చితో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు.

ఏడాదికి పదుల సంఖ్యలో పరువు హత్యలు జరుగుతున్నాయి. 2016లో తమిళనాడులో జరిగిన శంకర్ పరువు హత్య ఉదంతంలోనూ జరిగింది. తమిళనాట అగ్ర కులంగా భావించే



దేవర్ వర్గానికి చెందిన కౌసల్య తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న శంకర్ను హతమార్చిన తమ కుటుంబంతోపాటు ఉన్నత వర్గాల దురాగతాలపై పోరు సాగిస్తూనే ఉంది. తక్కువ కులం వారిని ప్రేమించారని, పెళ్లి చేసుకున్నారనే ఆగ్రహంతో కన్నబిడ్డలనే చంపుకునే ధోరణి ఆందోళనకరంగా పెరుగుతోంది. కొందరు తమ బిడ్డలనే చంపేస్తుంటే, మరికొందరు తమ బిడ్డలు ప్రేమించిన వారిని అంతం చేస్తున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం 2018 సెప్టెంబరులోనే సూర్యాపేటకు చెందిన ప్రణయ్ హత్య రెండు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. వైశ్య వర్గానికి చెందిన మారుతీ రావు తన కుమార్తెను ప్రేమించి పెళ్లాడాడన్న నెపంతో.... దళిత వర్గానికి చెందిన ప్రణయ్ని హంతక ముఠాకు కోటి రూపాయలు సుపారీ ఇచ్చి మరీ పట్టపగలే చంపించాడు. ఈ ఉదంతంలో అమృత తండ్రి మారుతీరావు ఏమి సాధించాడు? పరువు ప్రతిష్ట మరింతగా దిగజారి జైలు జీవితం అనుభవించి, కుమిలిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. పరువు పోతుందని కుమార్తె జీవితాన్ని నాశనం చేసి తమ జీవితాన్ని సర్వం పోగొట్టుకున్న మారుతీరావు ఏమి సాధించినట్లు, పరువు నిలిచిందా... మరింత దిగజారిందా?

ఆ ఉదంతం మరువక ముందే తాజాగా హేమంత్ హత్య కలకలం రేపింది. తన కూతురు ప్రేమ పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన లక్ష్మారెడ్డి.. అల్లుడు హేమంత్ని తీసుకెళ్లి హత్య చేశారు. తన భర్తను చంపిన వాళ్లను కఠినంగా శిక్షించాలని హేమంత్ భార్య అవంతి కోరుతోంది. గతంలో మారుతీరావుకు పట్టిన గతి నేడు లక్ష్మారెడ్డికి పట్టనుందా? అయితే ఆ ఘటనలకు పాల్పడి వాళ్లు సాధించింది ఏమిటి? కుటుంబాలను బజారు కీడ్చి మిగిల్చింది ఏమిటి? పరువు ప్రతిష్టల కోసం కన్న బిడ్డలనే చిదిమేసే తల్లిదండ్రులు.... అల్లుళ్లను హతమార్చే అత్తమామలు ఆ తర్వాత ఏమి సాధిస్తున్నారు? జైలుకెళ్లి శిక్ష అనుభవించి తమ జీవితాన్నే కోల్పోతున్నారు. ఈ విషయాన్ని అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. అదేసమయంలో దోషులకు కఠిన శిక్షలు పడి మరొకరు ఇలాంటి నేరం చేయాలంటే భయపడాల్సిన రీతిలో చట్టాలు ఉండాల్సిన అవసరం ఉంది. పోలీసులు కూడా కేసు దర్యాప్తు పేరిట కాలయాపన చేయకుండా బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి. దోషులకు శిక్ష పడే రీతిలో తగిన సాక్ష్యాధారాలను త్వరితగతిన కోర్టులకు అందజేయాలి. సమాజంలో జరుగుతున్న పరువు హత్యలపై ప్రజలలో అవగాహన పెరగటం కూడా ఎంతో ముఖ్యం. అదేరీతిలో ప్రేమ పేరుతో పిల్లలు కూడా నిండు జీవితాలను నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులను ఒప్పించి మెప్పించే ప్రయత్నం చేయాలి. తమ పిల్లలను ముందుగానే దారిలో పెట్టుకొని భవిష్యత్తు నిర్దేశం చేయకుండా ఆవేశంతో పరువుకోసం తల్లిదండ్రులు పరువు హత్యలకు పాల్పడితే, పరువు నిలుపుకోవటం అటుంచితే ఉన్న పరువు కాస్తా బజారుపాలు అవుతుందనడంలో సందేహం లేదు.

కుటుంబ పరువు ప్రతిష్ఠల పరిరక్షణ కోసమంటూ హత్యలకు పాల్పడుతున్నారు. చివరికి కటకటాలపాలవడమే కాకుండా పిల్లల భవిష్యత్తును చిద్రం చేస్తున్నారు. పరువు ముందు మానవత్వం సమాధి అయిపోతున్నా పర్వాలేదా? ప్రతిష్ఠ కోసం కన్నవారే కసాయిలవ్వాల్సిందేనా? తల్లిదండ్రులు మారాలా లేక పిల్లలు మారాలా? వాళ్లను అలా తయారుచేసిన సమాజం మారాలా?

- అజీజ్
8919568055

అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు సంక్షేమ పథకాల అమలు

- రాష్ట్ర నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- త్వరలో రేషన్ కార్డుల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి 6 కిలోల సన్నబియ్యం సరఫరా
- పథకాల అమలు పట్ల ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు
- పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ ప్రజలు ఆందోళన చెందవద్దు
- దరఖాస్తులు సమర్పణ కు చివరి తేదీ ఏమీ లేదు,అపోహలు తప్పుడు వార్తలు నమ్మవద్దు

సిరిసిల్ల, జనవరి 22 (మనం న్యూస్)ః రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న మంత్రి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు, రైతులకు, రైతు కూలీలకు, నిరుద్యోగులకు పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో మేలు చేయలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని, గత 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారని అన్నారు. జనవరి 26 నాడు ప్రారంభించి రాష్ట్రంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తు చేసిన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసినా, గ్రామ సభలలో దరఖాస్తు ఇచ్చిన విచారించి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు మండల కేంద్రాలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని మంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తరువాత

ప్రతి ఒక్కరికి 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో సాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100 శాతం అర్హులకు మొదటి దఫా లోనే ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి 5 లక్షల రూపాయలు అందిస్తున్నామని, ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి 6 లక్షల సహాయం అందజేయ బోతున్నామని అన్నారు. రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి ఎకరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి పంట వేసిన వేయకుండా రైతు భరోసా అందుతుందని అన్నారు. అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని కోరారు. జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా తాను నేడు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. 43 వేల 100 ఎకరాలకు సాగు నీరు అందించే రుద్రమ్మ ప్రాజెక్టు ను మొదటి ప్రాధాన్యత లో పెట్టామని, ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన మంత్రిని విజ్ఞప్తి చేశారు. రుద్రంగి మండలం మానాల లో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందించే త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని, మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్‌లో టీఎంసి నీళ్లు నింపామని, 25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చని, ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పా పూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణకు నిధులు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103, రైతు భరోసా క్రింద 1927, నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు. అనంతరం మంత్రులు కలికోట - సూరమ్మ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా క్రింద 1927, నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు. అనంతరం మంత్రులు కలికోట - సూరమ్మ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో ఘనంగా క్రీడోత్సవం

కరీంనగర్ టౌన్, జనవరి 22 (మనం న్యూస్)ః స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన క్రీడోత్సవం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల నిర్వాహకులు వి. మల్లారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాల్సిన అవసరం ఎంతగానో ఉందని, ఎదురవుతున్నఒత్తిడిని విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే క్రీడల పోటీల పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. దానికి తగిన వనరులను కల్పించినట్లయితే పలు క్రీడా పోటీలలో విజయాలు సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల నిర్వాహకులు వి. మల్లారెడ్డి అన్నారు. ఈ

సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాల్సిన అవసరం ఎంతగానో ఉందని, ఎదురవుతున్నటువంటి ఒత్తిడిని క్రీడలతో అధిగమించవచ్చని చెప్పారు. క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని పలు పరీక్షలలో విజయాలను చాలా సులువుగా సాధించవచ్చని వారు తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే అత్యుత్తమ శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయడమే కాకుండా వారికి తగిన ప్రోత్సాహంతో పాటు వనరులను కల్పించి విజేతలుగా తయారు చేస్తున్నా మని చెప్పారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనిస్తూ క్రీడల పట్ల మక్కువ పెంచుతున్నామని చెప్పడంలో ఎటువంటి సందేహా లు లేదని తెలుపుతూ గణతంత్ర దినోత్సవ వేడుక లు పరిష్కరించుకొని నేడు పాఠశాలలో విద్యార్థులకు వివిధ వినోదాత్మక క్రీడల పోటీలను నిర్వహించడం జరిగిందని చెప్పారు. క్రీడల పోటీలలో భాగంగా విద్యార్థులకు పరుగు పందెం, ఫ్రాగ్ జంపింగ్, ఈటింగ్ చాలెంజ్, మ్యూజికల్ చైర్ చాక్లెట్ క్యాచింగ్ తదితర పోటీలను నిర్వహించడం జరిగిందని తెలుపుతూ చాలా ఉత్సాహంతో క్రీడా పోటీలలో పాల్గొన్నటువంటి విద్యార్థులందరికీ శుభాభినందన లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లను ప్రోత్సహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ బ్యూరో, జనవరి 22(మనం న్యూస్)ఃఆడపిల్లను ప్రోత్సహించాలని, బాలికను సమాజంలో ఎదగనివ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బేటి బచావో బేటి పడావో పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అణచివేతకు వ్యతిరేకంగా బేటీ బచావో బేటి పడావో విజయాలను సాధించిందన్నారు. బాలికల రక్షణకు ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసికట్టుగా పనిచేస్తున్నాయని తెలిపారు. బాలిక విద్యను ప్రోత్సహించాలని, సమాజంలో ఎదిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి కె.సబిత, డిసిపిఓ పర్వీన్, సిడబ్ల్యుసి చైర్పర్సన్ ధనలక్ష్మి, కోఆర్డినేటర్లు శ్రీలత, సంపత్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్. ఎం. భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు విజయ మాధురి, మల్లయ్య పాల్గొన్నారు.

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 22 (మనం న్యూస్)ః 36వ జాతీయ రోడ్ భద్రత మాసోత్సవ పోస్టర్‌ను కరీంనగర్ ఇంచార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణల చేతుల మీద స్పోర్ట్స్ స్కూల్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రిజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పడాల రాహుల్, డి టి ఓ శ్రీకాంత్ చక్రవర్తి, ఎం వి ఐ రవి కుమార్, ఆర్టివో అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటాం

- నగర మేయర్ సునీల్ రావు

కరీంనగర్ టౌన్, జనవరి 22(మనం న్యూస్)ఃప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన వార్డు సభల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి పంపి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా కృషి చేస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ 33వ డివిజన్ భగత్ నగర్ పోలీస్ క్వాటర్స్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన వార్డు సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల్లో వ్యక్తం అయిన పలు సందేహాలను తీర్చిదరఖాస్తు దారులకు పలు సూచనలు చేశారు. వార్డు సభలో వార్డు ఆఫీసర్, అధికారులకు దరఖాస్తుల స్వీకరణ పై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగర వ్యాప్తంగా 60 డివిజన్‌లలో రెండు రోజులు ప్రజల నుండి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. మొదటి రోజు 1వ డివిజన్ నుండి 30 వ డివిజన్ వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిందని ఈ రోజు 31 నుండి 60 డివిజన్ వరకు దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. ఇందులో భాగంగా నే మేము ప్రాతినిధ్యం వహిస్తున్న 33వ డివిజన్‌లో ప్రజాపాలన వార్డు సభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. సంక్షేమ పథకాలకు

ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్య

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (మనం న్యూస్)ః అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని 54, 60 డివిజన్లలో ప్రజా పాలన డివిజన్ సభల్లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. సభల్లో స్వయంగా సుడా చైర్మన్ లబ్ది దారుల నుండి దరఖాస్తులు తీసుకొని వారి యొక్క అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులందరికి ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులు ఇవ్వటమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు.అధికారులు ప్రకటించిన లిస్టులో పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు

చేసుకున్నాగాని మళ్లీ పరిశీలించి అర్హులందరికీ ఇవ్వడం జరుగుతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నా రు. ఈ కార్యక్రమాలలో టిపిఎస్ తేజస్విని, వార్డు అధికారులు మోసిన్, శ్రీనివాస్, ఎండి తాజ్, కార్పొ రేటర్లు ఇఫ్రాన్ తహర్, వాల రమణారావు, కలిమొ ద్దిన్,పెద్దిగారి తిరుపతి,అహ్మద్‌అలీ,రాజ్ కుమార్, ఆరిఫ్,కొట్టె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల అనిల్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘన సన్మానం

శంకరపట్నం, జనవరి 22 (మనం న్యూస్)ః శంకరపట్నం మండల బిజెపి అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన ఏనుగుల అనిల్ ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ శంకరపట్నం మండలం స్థాయిలో ప్రజలు సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం చేసి గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేయాలని రెండవసారి బిజెపి మండల అధ్యక్షుడుగా ఎన్నికైన ఏనుగుల అనిల్ కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమరయ్య, మాజీ ప్రజాప్రతినిధులు సీనియర్ కార్యకర్తలు కొయ్యడ కుమార్ యాదవ్, చర్ల శ్రీనివాస్, కొయ్యడ అశోక్, మందాడి జగ్గారెడ్డి సత్యనారాయణ, బిజిలి సారయ్య, జనపట్ల రాజిరెడ్డి, పోతునూరి రాజు, నిమ్మచెట్టి సంపత్ రావు, బోడ తిరుపతిరెడ్డి, బొజ్జ సాయి ప్రకాష్, గూళ్ల రాజు, చుక్కల శ్రీకాంత్ యాదవ్, మొలుగూరి ప్రశాంత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గట్టు మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

జైపూర్, జనవరి 22 (మనం న్యూస్)ః గట్టు మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. జైపూర్ మండలంలోని వేలాల గ్రామాన్ని సందర్శించి మహాశివరాత్రి రాబోతున్న సందర్భంగా గ్రామంలో గట్టు మల్లన్న జాతర ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఎమ్మెల్యే వివేక్ కలిసి పలు శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. దర్శనం చేసుకుని భక్తులు ఇంటికి వెళ్లేదాకా పోలీసులు రక్షణగా ఉండాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అంతేకాకుండా వీఐపీ వాహనాలను గుట్ట పైకి

పంపకూడదని దేవుడి దర్శనానికి అందరూ సమానులే అని దేవుడి దగ్గర ఎవరూ వీఐపీలు కాదని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు మంచి నీటి సౌకర్యం కల్పించి, టెంట్ లు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ, ఎసిపి, సీఐ, ఎస్సై, డీ ఎఫ్ ఓ, దేవాదాయ శాఖ అధికారులు, మండల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

సైకిళ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (మనం న్యూస్)ః కరీంనగర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇందుర్తి పాఠశాలలోని పేద విద్యార్థులకు సైకిళ్లను, పలువురు మహిళలకు కుట్టు మిషన్ లను బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని ఉద్దేశం తో, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థినీ లకు సైకిళ్లను, అలాగే పదిమంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు గోరిట్యాల వెంకట కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాగే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలి పారు. ఇట్టి కార్యక్రమం లో క్లబ్ కార్యదర్శి పాక పవన కృష్ణ, మాజీ గవర్నర్ డీకే ఆనంద్, రాజిరెడ్డి, చిట్టి రామా రావు మాజీ కార్పొరేటర్, జి. ఆనంద్ కుమార్, పి. తిరుప తి, ఆలిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఇందుర్తి పాఠశా ల విద్యార్థుల కోసం అడిగిన వెంటనే సైకిళ్లను అం దించి న రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులకు పాఠశాల ఉపాధ్యా యులు బి. ఓదెల్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా పాలనలో పేదలకు న్యాయం జరగడంలేదు

- మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింలు
- జాబితాలో పేర్లు లేకపోవడంతో లబ్ధిదారుల ఆగ్రహం
- పోలీస్ పహారాలో గ్రామ సభలు

తొగుట, జనవరి 22, మనం న్యూస్: ప్రజా పాలనలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదని వెంకట్రావుపేట మాజీ ఎంపిటిసి కంకణాల నర్సింలు విమర్శించారు. తొగుట మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో బుదవారం నిర్వహించిన గ్రామ సభలో మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింలు మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారెంటీల గుట్టు బయటపడిందని, అలవిగాని హామీలిచ్చి ఆనక వాటిని ఎగ్గొట్టే విధంగా అమలు చేస్తున్న కొద్దిపాటి పథకాల్లోనూ కోతలు, కొర్రీలు పెడుతున్నారని దీంతో కాంగ్రెస్ సర్కారు తీరుపై జనాగ్రహం పెల్లుబికిందన్నారు. గ్యారెంటీలపై ఎవరిని అడగాలో తెలియక ఇన్నాళ్లూ వేచిచూసిన జనం గ్రామసభల్లో తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారన్నారు. రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన గ్రామసభల సాక్షిగా అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. లబ్ధిదారుల జాబితాల్లో తమ పేర్లు ఎందుకు లేవంటూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలను ఎక్కడికక్కడ నిలదీశారన్నారు. మండలంలోని ఏ గ్రామ సభలో చూసినా సర్కా ప్రజలు తీవ్ర అసంతృప్తిని వెల్లగక్కారన్నారు. గ్రామసభల్లో ప్రజల నిలదీతలతో ప్రభుత్వం అప్రమత్తమై గ్రామసభలను పోలీసు పహరా మధ్య నిర్వహించారని, ప్రజలు ప్రశ్నిస్తారని, నిలదీస్తారన్న భయంతోనే సభల వద్ద పోలీసులను కాపలా పెట్టారని విమర్శించారు. నాలుగు పథకాలకు కొత్తగా మళ్ళీ దరఖాస్తులు ఇవ్వాలంటూ అధికారులు పత్రాలు విడుదల చేయడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రజా పాలనలో దరఖాస్తులు ఇచ్చామని, కులగణన సర్వేలో కూడా తమ వివరాలన్నీ చెప్పామని, తమకు సంబంధించిన అన్ని రకాల వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయని, మళ్లీ ఇప్పుడు ఎందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారని, తాము గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీశారు. మార్పు అంటే ఇదేనా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ఘనంగా జరిగిన సీతారాముల కళ్యాణం

నంగునూరు, జనవరి 22, మన న్యూస్: అయోధ్య బాలరాముడి ప్రతిష్టా మహోత్సవ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నంగునూరు మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామంలో బుధవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా అక్కెనపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ ఆలయం వద్ద సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో పలువురు దంపతులు పాల్గొని స్వామి వారికి ఓడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, వెంకటయ్య, రామచంద్రం, ఇంద్రసేనారెడ్డి, మల్లయ్య, శివ, మహిళలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- టీపీటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

దుబ్బాక, జనవరి 22, మనం న్యూస్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ దుబ్బాక మండల శాఖ 2025 సంవత్సరం క్యాలెండరు చీకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి. రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎం.ఈ.ఓ. ప్రభుదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలతో పాటు సామాజిక సమస్యలు, శాస్త్రీయ విద్యా విధానం కొరకు కూడా పోరాటం చేస్తుందని అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ జి. జానకిరాములు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు గౌరవ వేతనం చెల్లించాలని, సీసీఎల్ మంజూరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగారెడ్డి, చంద్రశేఖర్, సతీష్, శ్రీనివాస్, పవన్, బాలరాజ్, పద్మ, జ్యోతి, రేణుక, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

- తొగుట ఎస్.ఐ. రవికాంత్ రావు

తొగుట, జనవరి 22, మనం న్యూస్: మద్యం సేవించి వాహనాలు నడపరాదని తొగుట ఎస్. ఐ. రవికాంత్ రావు యువత, వాహనదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం తొగుట ఎస్ఐ రవికాంత్ రావు సిబ్బందితో కలిసి తుక్కాపూర్ గ్రామంలో వాహనదారులకు యువకులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి ఆటోలు నడపవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగి కుటుంబాలు చిద్రం అవుతున్నాయని, జీవితం ఎంతో ముఖ్యమైనదని, ప్రమాదాలు కొనితెచ్చుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ గ్రామ యువత, వాహన దారులు పాల్గొన్నారు.

నేడు హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్, జనవరి 22,(మనం న్యూస్): హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరవ్వనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. 2 వ వార్డులో పోచమ్మ కామన్ ప్రారంభోత్సవం, 5 వ వార్డులో చదువు గది నిర్మాణం, ఎస్టీ బంజారా భవన్ కమ్యూనిటీ హాల్, 8, 9, 15 వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన, 19 వ వార్డులో నైపుణ్య శిక్షణ కేంద్రంకు శంకుస్థాపన, పందిల్ల బ్రిడ్జి-ఎల్లమ్మ చెరువు బీటీ రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన, రైతు వేదిక వద్ద కుట్టు యంత్ర శిక్షణ కేంద్రం నిర్మాణం, మిని స్పోర్ట్స్ హాల్ నిర్మాణం, వైశ్యభవన్, హుస్నాబాద్ బస్టాండ్ పునరుద్ధరణ ప్రారంభోత్సవాలకు హాజరవ్వనున్నట్లు తెలిపారు.

అందరికీ పంగనామాలు

- ఎగవేతలు... కోతలే
- యాసంగి, వానా కాలానికి కలిపి రైతు భరోసా ఇవ్వాలి
- దరఖాస్తుల పేరుతో కాలయాపన
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట, జనవరి 22, మనం న్యూస్ ప్రతినిధి: ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే రోజూ పరమాన్నమే అంటూ అబద్దపు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను మరిచి అందరికీ పంగనామాలు పెట్టిందని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం స్వీకరించాల్సిన దరఖాస్తుల సభలను కూడా పోలీసుల నిర్బంధాల మధ్య నిర్వహిస్తున్నారంటే ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజాపాలన వార్డు సభల్లో భాగంగా జరుగుతున్న కార్యక్రమంలో బుధవారం నాడు పట్టణంలోని 15వ వార్డు గాడిచెర్లపల్లిలో నిర్వహించిన వార్డు సభలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను చెత్తబుట్టలో వేయకుండా నాడే ఆన్ లైన్ చేసి ఉంటే నేడు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది కాదన్నారు. దరఖాస్తుల స్వీకరణ, పూటకో మాటతో కాలం వెల్లదీయడం తప్పితే ప్రజలకు

ఒరిగిందేమీ లేదన్నారు. ఎకరాకు రైతుబంధును పెంచిస్తామని చెప్పి అసలుకే ఎగవెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రేవంత్ సర్కార్ కు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే రెండు పంటలకు సంబంధించిన రైతు భరోసాను ఒకేసారి ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. రుణమాఫీ అసంపూర్తిగా జరిగిందని, ఎక్కడికక్కడ రుణమాఫీ కాలేదని రైతులు గగ్గోలు పెడుతుంటే రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో కూర్చొని అందరికీ చేశామంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతు రుణమాఫీపై చర్చించేందుకు గాడిచర్లపల్లి వచ్చినా సరే, రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లికి వచ్చినా సరే చర్చకు సిద్ధమన్నారు. అధికారంలోకి వచ్చి ఎగవేతలు, సంక్షేమ పథకాలకు కోతలు పెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాస్తా ఎనుముల రేవంత్ రెడ్డి పోయి ఎగవేతల రేవంత్ రెడ్డిగా మారారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని, ఉపాధిహామీ కూలీలకు సైతం రైతు భరోసా అందించాలన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఆశిత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, వార్డు కౌన్సిలర్ పాతూరి సులోచన శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఉమారాణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

మిరుదొడ్డి, జనవరి 22, మనం న్యూస్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్.ఐ. హరీష్ తెలిపిన వివరాల ప్రకారం చిన్న నిజాంపేట గ్రామానికి చెందిన షేర్ల రంజిత్ ఈనెల 21 సాయంత్రం 5 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి బయల్దేరి రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామస్తుల సహాయంతో వెతకగా పోతారెడ్డిపేట గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్ద రంజిత్ వాహనంతోపాటు ఫోన్, చెప్పులు కనిపించడం జరిగిందన్నారు. గ్రామస్తుల సహాయంతో చెరువులో వెతకగా రంజిత్ మృతదేహం కనిపించింది. రంజిత్ కాలకృత్యాల గురించి చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడవచ్చని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అనర్హులను తొలగించి అర్హులను చేర్చండి

- అధికారులతో ప్రజల వాగ్వాదం

సిద్దిపేట అర్బన్, జనవరి 22, మనం న్యూస్: అధికారులు ప్రవేశపెట్టిన జాబితాలలో అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలని ప్రజలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా జనవరి 26 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నాలుగు పథకాలలో భాగంగా గ్రామ సభలలో భాగంగా రెండవ రోజు సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి, పొన్నాల, బూరుగుపల్లి, కృష్ణ సాగర్ గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు గ్రామ సభలు ప్రారంభం కాగానే ప్రతి పథకంలో భాగంగా అర్హుల లిస్టులను అధికారులు చదువుతున్న సందర్భంలో అనర్హులు ఉన్నారంటూ, వారి పేర్లను జాబితాల నుండి తొలగించాలని పొన్నాల, మిట్టపల్లి గ్రామాల్లోని ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే జాబితా నుండి తొలగిస్తామని అన్నారు. ప్రభుత్వం అర్హులకే పథకాలు చేరాలి అన్న ఉద్దేశంతో పథకం ప్రవేశపెట్టిందని అర్హులకు అందే విధంగా గ్రామ సభలో తీసుకున్న నిర్ణయాలతో ముడిపడి ఉంటుందన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో భాగంగా వచ్చిన అధికారులు పథకాల ప్రకారంగా అర్హుల జాబితాను చదువుతుండగా గ్రామస్తులు ఒక్కసారిగా అధికారుల వైపు దూసుకెళ్లారు. దీంతో అధికారులు, గ్రామస్తుల మధ్య గందరగోళం జరగడంతో సభను ముగియకుండానే అర్ధాంతరంగా నిలిపివేశారు. అధికారులు సమస్యలపై పథకాల వివరణ పై ఎంత చెప్పినా గ్రామస్తులు వినకుండా అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సభ అర్ధాంతరంగానే ముగిసింది. అర్బన్ మండలంలోని గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులు, తహసిల్దార్ సలీం ఎంపీఓ వేణుగోపాల్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్, ఇందిరమ్మ కమిటీ మహిళా నాయకురాలు కవిత, పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య, నాయకులు యాదగిరి శ్రీనివాస్ బలరంగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి, జనవరి 22, మనం న్యూస్: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు నిరుపేద కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక క్యాంప్ ఆఫీస్ లో మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏడుగురికి, అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన పేద ప్రజలు అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందినట్లయితే ఆసుపత్రి బిల్లులను అందించి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద కుటుంబాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందినట్లయితే వారి నుండి దరఖాస్తు స్వీకరించి క్యాంప్ ఆఫీస్ లో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ రాజేశ్వర్, బిఆర్ఎస్ నాయకులు రంజిత్, రాజిరెడ్డి, మిరుదొడ్డి మండల సీనియర్ నాయకులు సూకూరి లింగం, మాజీ ఎంపిటిసి గొట్టం బైరయ్య,రమేష్, యాదకృష్ణ తోపాటు తదితరులు ఉన్నారు.

క్రీడోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్,జనవరి 22,(మనం న్యూస్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడోత్సవ్ - 2025 పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నగర కన్వీనర్ అంజి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక, ధృడత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ పోరాటపటిమ, జట్టు స్ఫూర్తి, సమరసత భావనలను అభివృద్ధి చేసేలా క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఖేలో భారత్ పేరుతో దేశ వ్యాప్తంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేపట్టిందని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు క్రీడల పై ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ, గెలుపోటములను పరిచయం చేయడంతో పాటు వారి జీవిత లక్ష్యాలను సాధించడమే ఈ క్రీడోత్సవ్ లక్ష్యమన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల, పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఈ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్, నగర ఉపాధ్యక్షుడు రాజేష్, నగర సంయుక్త కార్యదర్శి చరణ్, సోషల్ మీడియా కన్వీనర్ భాను, రాజేష్, వెంకటేశ్, వంశీ, అంజన్‌కుమార్, తదితరులున్నారు.

రేపటి నుండి స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొండపాక, జనవరి 22, మనం న్యూస్: అతి పురాతనమైన స్వయంభు శంభులింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుండి మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో సిద్దిపేట పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలో స్వయంభుగా వెలిసిన దేవాలయంలో ఈనెల 24వ తేదీ నుండి 26వ తారీఖు వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు శుక్రవారం ఉదయం 9:45 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకం, సాయంత్రం 4 గంటలకు శకటోత్సవం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు స్వామివారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, శంభు దేవునికి అన్నాభిషేకము, మూలవిరాట్ కు అలంకారం, పిమ్మట లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ రుద్ర మన్య పాశుపత వాహనం. సాయంత్రం 7:53 గంటలకు దిష్టి కుంభాల నిర్వహణ, రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. 26 అదివారం నాడు ఉదయం 9 గంటలకు స్వామివారి ఎదుర్కోలు. 11గంటల45 నిమిషములకు అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం, రాత్రి 7 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు, 8 గంటలకు రథోత్సవం ఉంటుందని శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

అర్హులైన చివరి లబ్ధిదారు వరకు సంక్షేమ పథకాలు వర్తింపు

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది
- ప్రాథమిక జాబితాలో పేర్లు లేకుంటే దరఖాస్తు చేసుకోవాలి
- నేలకొండపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్)ః అర్హులైన చివరి లబ్ధిదారువరకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మంత్రి నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామంలో రూ. 20.4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, పైనంపల్లి గ్రామంలో 20 లక్షలతో, అప్పల నరసింహాపురంలో 30 లక్షలతో, కట్టుకాచారంలో 20 లక్షలతో నిర్మించిన రోడ్లకు ప్రారంభోత్సవాలు చేసారు.కోరట్లగూడెంలో 15 లక్షలతో, కోనాయి గూడెంలో 20 లక్షలతో, కొంగర గ్రామంలో 15 లక్షలతో, బుద్ధారం గ్రామంలో 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో చేసుకున్న శంకుస్థాపనలతో కలిపి సిసి రోడ్ల పనులు పూర్తయ్యాయని, గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించుకున్నా మని, ఇంకా ఒకటి, రెండు రోడ్లు ఉన్నా మంజూరు చేసుకొని పూర్తి చేసుకుందామని అన్నారు. జనవరి 26 నుంచి ప్రభుత్వం అమలు చేసే 4 నూతన కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభ కూడా జరిగిందని, పేర్లు రాని వాళ్ళు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి, మంగళవారం దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులు ఉన్నా ప్రభుత్వం పథకాలు అందిస్తుందని అన్నారు. గ్రామ సభలను కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలను భయాందోళనకు గురి చేసేందుకు, దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మేలు చేయాలని చిత్తశుద్ధి ఉందని, ఎవరి మాటలు నమ్మవద్దని అన్నారు. పేద ప్రజలందరికీ పథకాలు అందుతాయని, ఎవరైనా పేదలు దరఖాస్తు చేసుకోకపోతే గ్రామ సభలు, ప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తులు అందించాలని అన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగు తుందని, ఇందిరమ్మ ఇండ్ల మొదటి దశలో సొంత స్థలం ఉన్న వారికి అందిస్తున్నామని, తరువాత దశలలో భూమి లేని అర్హులకు ఇండ్లు మంజూరు చేసి అందిస్తామని అన్నారు. కోరట్లగూడెం గ్రామంలో 15 లక్షలతో సీసీ రోడ్లు వేసుకున్నామని, జరిగబోయే గ్రామసభ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు ప్రాథమిక జాబితా అందిస్తారని, ఎవరైనా అర్హుల పేర్లు లేని పక్షంలో దరఖాస్తులు అందిస్తే తప్పనిసరిగా విచారించి అందజేస్తామని అన్నారు. 4 పథకాలకు సంబంధించి అధికారులు అందించే ప్రాథమిక జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే లిఖితపూర్వకంగా సమాచారం అందిస్తే విచారించి తొలగించడం జరుగుతుందని అన్నారు. అప్పల నర్సింహాపురం గ్రామంలో 30 లక్షలతో సిసి రోడ్ల నిర్మించి ప్రారంభించు కున్నామని, గ్రామంలో రాబోయే వర్షా కాలం లోపు పెండింగ్ రోడ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం అమలు చేస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమం దిశగా రెండు లక్షల రుణమాఫీ, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందించామని, జనవరి 26 నుంచి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేల రూపాయల రైతు భరోసా, భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి 12 వేల ఆర్థిక సహాయం, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, మొదటి విడతలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం. విజయ బాబు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర రావు, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారి నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి సరిత, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ లు వాణిశ్రీ, పుష్పలత, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల తహసీల్దార్ మాణిక్యరావు, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దాట్ల విద్యార్థికి ఘన సన్మానం

దంతాలపల్లి, జనవరి 22(మనం న్యూస్)ః మహబూబాబాద్ జిల్లా, దంతాలపల్లి మండలం దాట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహబూబాబాద్ జిల్లా స్థాయి ఎల్టా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలక్యూషన్ (ఉపన్యాస) పోటీలో పాఠశాల విద్యార్థి మోటం తిరుమలేష్ తృతీయ బహుమతి పొందినందుకు గాను ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య అధ్యక్షతన అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని మండలాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో తమ విద్యార్థి తృతీయ బహుమతి పొందడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో నిర్వహించే పోటీలలో ఉత్తమ ప్రదర్శన పొంది పాఠశాలకు పేరు తేవాలని, దీని వెనుక ఆంగ్ల ఉపాధ్యాయుడు కొంపెల్లి రామయ్య కృషి అభినందనీయం అని వివరించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు కొంపెల్లి రామయ్య మాట్లాడుతూ ఎనిమిదవ తరగతి విద్యార్థి అయిన తిరుమలేష్ ప్రతిభను గుర్తించి తను పోటీలో పాల్గొనుటకు ప్రోత్సహించి తీర్చి దిద్దడం జరిగిందని, తద్వారా తను చాలా చక్కగా నేర్చుకొని మండల స్థాయిలో ప్రథమ, జిల్లా స్థాయిలో పోటా పోటీగా నువ్వా నేనా అన్న విధంగా పోటీ పడి తృతీయ స్థానంలో నిలిచాడని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎ. రవీందర్ రెడ్డి, ఎల్టా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల చేత బహుమతి పొందాడని, భవిష్యత్తులో ఇంకా ఉత్తమ ప్రదర్శన ఇచ్చి పాఠశాలకు మంచి పేరు తీసుక రావాలని ఆకాంక్షించారు. కష్ట పడితే సాధించంది ఏది లేదని, ఇదే విధంగా తిరుమలేష్ ముందుకు వెళితే మంచి స్థాయిలో ఉంటాడని అభినందించారు. అనంతరం హెచ్ఎం, మిగితా ఉపాధ్యాయులు కలిసి శాలువా, ఆంగ్ల ఉపాధ్యాయుడు కొంపెల్లి రామయ్య రాసిన గుండె చప్పుడు పుస్తకం మెమంటో, సర్టిఫికెట్స్ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వప్న, సునీత, సాయికుమార్, యాక స్వామి, రిచిత తదితరులు పాల్గొని అభినందించారు.

యరమల కోటారెడ్డికి డాక్టరేట్

మధిర, జనవరి 22(మనం న్యూస్): మధిర మండల పరిధిలోకి మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యరమల కోటారెడ్డికి డాక్టరేట్ లభించింది. తెలుగు సాహిత్యంలో' చావా శివకోటి కథలు - సమగ్ర పరిశీలన 'అనే అంశం మీద ఆచార్య నారి శెట్టి వెంకట కృష్ణారావు పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.దాంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యరమల కోటారెడ్డికి డాక్టరేట్ ను ప్రకటించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మత్స.భీమరాజు, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీ రఘురాం రెడ్డి కృషితో ముందడుగు

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్)ః ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి.. చొరవ, ప్రత్యేక శ్రద్ధతో కొత్తగూడెం ఎయిర్ పోర్ట్ఏర్పాటు కల సాకారం కాబోతోంది. పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంలో సుదీర్ఘకాల ఆకాంక్ష నెరవేరబోతోంది. ఇక్కడ గ్రీన్ ఫీల్ విమానాశ్రయం ఏర్పాటు అవసరం, ఆవశ్యకతను ఎంపీ పలుమార్లు వెల్లడించారు. గతేడాది జూలైలోనే లోక్ సభ లో 377 నిబంధన కింద ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనికి కేంద్ర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. సానుకూలంగా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎంపీల బృందంతో కేంద్ర మంత్రిని కలిశారు. ఇక్కడ ఎయిర్ పోర్ట్ నిర్మిస్తే..ఆంధ్ర, చత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని, దక్షిణ అయోధ్య భద్రాచలం ఉందని, సింగరేణి తో సహా ప్రఖ్యాత పరిశ్రమలు ఉన్నాయని అన్నారు. కొత్తగూడెంలో వెయ్యి ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, భౌగోళిక, సామాజిక అంశాలు కలిసి వస్తాయని వివరించారు. ఎంపీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన సూచనలతో.. కదిలొస్తున్న ఏఏఐ బృందం దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం పుణ్యక్షేత్రం సందర్శన సులభమై.. టెంపుల్, ఎకో టూరిజం పెరుగుతాయని ఎంపీ గతంలో తెలిపారు. సింగరేణి ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో ఉందని, ఇంకా ప్రతిష్టాత్మక కే టి పి ఎస్, స్పాంజ్ ఐరన్, నవభారత్, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ పేపర్ బోర్డు.. ఇలా ప్రఖ్యాత పరిశ్రమలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నాయని వివరించారు. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న రేణుక చౌదరి కొంత చొరవ చూపగా.. ఇప్పుడు ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి.. పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కదలిక తీసుకొచ్చారు. ఈ క్రమంలో గురువారం ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి ప్రత్యేక బృందం కొత్తగూడెం వస్తుండడంతో.. స్థానిక ప్రజలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే గ్రామసభలు

- అనిశెట్టిపల్లి గ్రామ సభలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగ చేసుకోవాలి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 22 (మనంప్రతినిధి): ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే గ్రామసభలు ఉపయోగపడతాయని , ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలలో రెండవ రోజు బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లక్ష్మీదేవి పల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభ జరుగుతున్న తీరు, దరఖాస్తు ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి మరియు గ్రామపంచాయతీ సెక్రటరీ నాలుగు సంక్షేమ పథకాల అర్హుల జాబితాను సభకు చదివి వినిపించారు. అర్హుల జాబితాలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అర్హులై ఉండి జాబితాలో పేరు రానివారు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని గ్రామ సభలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. గ్రామ సభల నిర్వహణ అర్హులను, అనర్హులను గుర్తించడానికి మరియు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడానికి అని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామ సభలలో కానీ ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ చలపతిరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామపంచాయతీ సెక్రటరీ మరియు సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నో రికమండేషన్స్

- ఇందిరమ్మ ఇల్లు ఎంపికలో అర్హులకు అన్యాయం జరగకూడదు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 22 (మనంప్రతినిధి): పాతకొత్తగూడెం నాలుగో వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా అర్హుల కొరకు ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన వార్డు సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ, నియోజకవర్గంలో అధికారులు లబ్ధిదారుల ఎంపికలు విషయంలో అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాలని, ఎక్కడ అవినీతికి తావిలేకుండా పారదర్శకంగా ఈ ఎంపిక జరగాలని నో రికమండేషన్స్ అని, ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల ఎంపికలో అధికారులకు పూర్తిస్థాయి సమాచారాన్ని తెలియజేస్తూ న్యాయబద్ధంగా ఎంపిక చేయాలని కూనంనేని కోరారు. విడతల వారీగా నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరయ్యే ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేదవాడికి అందే విధంగా చూస్తానని, అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందే విధంగా చూడాలని, రైతు భరోసా విషయంలో అర్హులైన ప్రతి రైతుని గుర్తించాలని, వారు అధికారులని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో వారితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అధికారులు అర్ ఐ అలిమ్, వార్డు ఆఫీసర్స్ రామమూర్తి, నాగశ్రీ , జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, బిల్ కలెక్టర్ సంతోష్, రికార్డు అసిస్టెంట్ జవిద్ పాషా, వార్డు మెంబర్ సుజాత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి,సాంబ,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్)ః గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ ఫ్లాగ్ హోస్టింగ్ చేస్తారని అన్నారు. ఉదయం 9.00 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా జరిగే జిల్లా స్థాయి వేడుకలో జాతీయ సమైక్యతను తెలియజేస్తూ 3 కల్చరల్ ప్రోగ్రాం లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారికి తెలిపారు.గణతంత్ర వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా చేయాలని ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు.జనవరి 26 నుంచి నూతనంగా ప్రారంభమయ్యే పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నమూనాను స్టాల్ లో ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా శక్తికి సంబంధించిన స్టాల్ ను గ్రామీణ అభివృద్ధి అధికారి సిద్ధం చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, ఈ జాబితాలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్లు కూడా పంపాలని, వరదల సమయంలో బాగా పని చేసిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందేలా చూడాలని, స్వాతంత్ర్య సమరయోధులకు వాహనాలు ఏర్పాటు చేసి వేడుకలలో పాల్గొనేలా చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, గణతంత్ర వేడుకలకు అవసరమైన మేర త్రాగునీటి క్యాన్లు ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డి.ఆర్.ఓ. రాజేశ్వరి, ఆర్డీఓ నరసింహారావు, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం, జనవరి 22(మనం న్యూస్)ః పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సర క్యాలెండర్ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తామన్నారు. వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ అసోసియోషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపధ్యాక్షుడు ఏశోబు,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. వెంకటేశ్వర్లు, జానీమియా, మోహన్ రావు, పంతులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ

ఖమ్మం, జనవరి 22(మనం బ్యూరో)ః ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకాన్ని కల్గించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటి, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నొస్టిక్ సెంటర్, దోబీ మిషనరీస్, ఎంపిహెచ్ డబ్ల్యు. ట్రైనింగ్ సెంటర్, మెడికల్ కళాశాల బాలుర వసతిగృహం, ఎంసిహెచ్, యునాని, ఆయుర్వేద వైద్యశాల, ఓపి, మార్చురీ పక్కనున్న ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల సహాయకులతో మాట్లాడి, అందుతున్న సేవలు, ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ప్రభుత్వ దవాఖానకు వచ్చే వాహనాల పార్కింగ్, హాస్పిటల్ ప్రధాన గేట్, బయట వాహనాల రద్దీ నియంత్రణ, ప్రధాన మార్గం అర్చీ నిర్మాణ విషయమై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని అన్నారు. ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాల గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

రోగులకు అందించే భోజనం రుచికరంగా, పౌష్టికాహారంతో కూడుకున్నదై ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో నిర్వహణ పక్కాగా ఉండాలని తెలిపారు.

టూ వీలర్ పార్కింగ్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల వైద్యం నిమిత్తం ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. టాయిలెట్ మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆస్పత్రిలోని క్రిటికల్ కేర్ భవనం వైపు, పరిపాలన భవనం వైపున సిసి రోడ్లు నిర్వహణకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఆస్పత్రిలోని ప్రధాన ద్వారం వద్ద రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా ఏ విభాగం ఎక్కడుందని విషయంపై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి రోగుల సహాయకులకు తెలపాలని అన్నారు. ఆస్పత్రికి 10 ఏసీలు, రేడియాలజీ పోస్టులు వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి నుంచి రోడ్డు అవతలకు మెడికల్ కళాశాలకు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

కలెక్టర్ తనిఖీ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.బి.కిరణ్, ఆర్ఎంఓ డా.రాథోడ్, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి. పార్వతమ్మ, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విద్య వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి ,ఎమ్మెల్యే



దేవరకద్ర జనవరి 22 మనం న్యూస్ : విద్య వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారము దేవరకద్ర మండల కేంద్రంలో 30 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ,35 కోట్లతో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేసుకున్నాము అని ఆయన అన్నారు.సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేసి, హాస్పిటల్ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆయన తెలిపారు.యాక్సిడెంట్లలో గాయపడిన వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి 30 కిలో మీటర్లకు ఓ ట్రామాకేర్ సెంటర్ను ఏర్పాటు చేయబోతున్నాం అని మంత్రి చెప్పారు.దేవరకద్రలోనూ ఓ ట్రామా కేర్ సెంటర్ డయాలిస్ సెంటర్ రాబోతున్నది అని ఆయన చెప్పారు.పేదలకు విద్య, వైద్యం, సామాజిక భద్రతను అందించే బాధ్యత ప్రభుత్వానిది అని ఆయన అన్నారు ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్పిటల్స్లో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నాం అని ఆయన చెప్పారు.ఆరోగ్యశాఖలో సంవత్సర కాలంలోనే సుమారు 8 వేల ఉద్యోగాలను రిక్రూట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.అన్ని రకాల మందులను, సర్జికల్స్ను, డయాగ్నస్టిక్స్ సేవలను అందుబాటులో ఉంచడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మహబూబ్నగర్ జనరల్ హాస్పిటల్లో కార్డియాలజి, నెఫ్రాలజీ వంటి అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించబోతున్నాం. అని ఆయన తెలిపారు.అలాగే, త్వరలోనే దేవరకద్రలో కూడా ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం అని ఆయన తెలిపారు.డయాలసిస్ పేషెంట్లు ఇబ్బంది పడొద్దని, వారికి సమీపంలోనే డయాలసిస్ సేవలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం అని ఆయన చెప్పారు.ఏడాది కాలంలోనే కొత్తగా 18 డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.దేవరకద్ర, మక్తల్కు కొత్తగా డయాలసిస్ సెంటర్లను మంజూరు చేయడం జరిగిందని ఆయన చెప్పారు.ఒక్కో డయాలసిస్ సెంటర్లో 5 చొప్పున, పది డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తీసుకొని వస్తున్నాము అని ఆయన తెలిపారు.ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేయాలని చూసే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం అని ఆయన హెచ్చరించారు.చట్టవ్యతిరేకంగా ఆర్గాన్ ట్రాన్స్ప్లాంటేషన్ చేసిన హాస్పిటల్ యాజమాన్యంపై కఠిన చర్యలకు ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు.గ్రామసభల రూపంలో ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చాం. అధికారులే ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఆత్మీయ భరోసా వంటి అన్ని పథకాలు అందజేస్తాం అని ఆయన తెలిపారు.మీ పేర్లు జాబితాలో లేవని ఆందోళన చెందొద్దు.మరోసారి దరఖాస్తుకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.ప్రతి దరఖాస్తును పరిశీలించి, ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం అని ఆయన తెలిపారు.దశలవారీగా అర్హులైన అందరికీ ఇళ్లు, రేషన్కార్డులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిందని ఆయన అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పక్షాలు లేనిపోని నిందలు మోపుతున్నారని ఆయన అన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని కొకుంట్లమండల కేంద్రానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం జరుగుతున్నది అందుకు కావాల్సిన స్థలాన్ని ఎంపిక చేసి పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.అలాగే అంబులెన్స్ కూడా మంజూరు చేయడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రజాపాలన ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని ఆయన అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉన్నదని ఆయన అన్నారు. తదుపరి మంత్రికి ఎమ్మెల్యేలకు నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్ సురేంద్ర ప్రతాప్, వైద్య కమిషనర్ ఆర్డీవో నవీన్ ఎంపీడీవో శ్రీనివాసరావు తహసిల్దార్ కృష్ణయ్య వైద్యాధికారి శరత్ చంద్ర అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ కథలయ్య టిపిసిసి ఆర్గనైజర్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి కిషన్ రావు మండల పార్టీ అధ్యక్షులు అంజల్ రెడ్డి రాఘవేంద్ర రెడ్డి పట్టణ అధ్యక్షులు సయ్యద్ ఫారుక్ అలీ దేవస్థాన చైర్మన్ నరసింహారెడ్డి హనుమంత్ రెడ్డి రాంపండు భరతమ్మ రఘువర్మ కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి గౌని రాము కోన రాజశేఖర్ రాఘవేందర్ వేణుగోపాల్ రెడ్డి బాలరాజ్ రామాంజనేయులు కిరణ్ వివిధగ్రామాల కార్యకర్తలు నాయకులుఅధికారులు అనధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే బండర్ పల్లి వాగులో అక్రమ ఇసుక రవాణా

తగ్గుతున్న భూగర్భ జలాలు..

దేవరకద్ర జనవరి 22 మనం న్యూస్ : దేవరకద్ర మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది. పట్ట పగలే బుధవారము బండర్ పల్లి వాగులో నుంచి ఇసుక లూటీ అవుతున్నది. ఇంత జరుగుతున్నా కూడా అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం సిగ్గుచేటుగా ఉన్నదని ప్రజలు నివసిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కూడా నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. జేసీబీ,భారత్ బెంజులతో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా అధికారుల కళ్ళముందే జరుగుతున్నా కూడా చూసి చూడనట్లుగా ఉండడం విచిత్రంగా ఉన్నదని ప్రజలు అంటున్నారు.రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.రోజు రూ. 10 నుంచి 15 లక్షల ఆదాయం ఆర్జిస్తున్న ఇసుక మాఫియా వారిపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉన్నదని ప్రజలు రైతులు అంటున్నారు. హైవే పక్కనే ఇసుక రవాణా జరుగుతున్న నోరు మెదపని యంత్రాంగం మౌనంగా ఉన్నదని ప్రజలు అంటున్నారు. అధికారులకు ముడుపులు అందడంతో అంతా సైలెంట్ గా ఉన్నారని ఆరోపిస్తున్నారు.రాబోయే వేసవిలో త్రాగు,సాగునీటి కష్టాలపై రైతులు,గ్రామస్తులు ఆందోళన చేయడానికి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు శ్రద్ధ తీసుకొని అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కొరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయి

దేవరకద్ర జనవరి 22 మనం న్యూస్ : ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరి లబ్ధిదారులకు అందుతాయని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. బుధవారము మండల పరిధిలోని చౌదర్పల్లి హాజీలాపురం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం అమలు జరిగే విధంగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, ప్రజలు ఆందోళన చెందకుండా వచ్చిన అధికారులకు తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ తిరుపతయ్య మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంత్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది వారు వ్యవసాయ సిబ్బంది వారు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పొట్లపల్లి ఆలయంకు బస్సులు నడపండి

- బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గౌడ్

హుస్నాబాద్,జనవరి 22,(మనం న్యూస్): పొట్లపల్లి శ్రీస్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంకు హుస్నాబాద్ పట్టణ కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గౌడ్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హుస్నాబాద్ డిపోకు చెందిన బస్సు పొట్లపల్లి నుంచి గుండారెడ్డిపల్లి వరకు నడిచేదని ఆ బస్సును మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. హుస్నాబాద్కు కూతవేటు దూరంలో ఉన్న మరో వేములవాడ ఆలయంగా పిలుచుకునే పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంకు బస్సులను ఎందుకు నడపట్లేదో చెప్పాలన్నారు. వరంగల్, సిద్దిపేట డిపోల బస్సులను ఉదయం, సాయంత్రం వేళల్లో పొట్లపల్లి గ్రామం మీదుగా నడిపితే కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఆర్టీసీ అధికారులతో మంత్రి సమావేశం ఏర్పాటు చేసి పొట్లపల్లికి బస్సులు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మాట ఇచ్చాం...నిలబెట్టుకుంటున్నాం

- ప్రజల వద్దకే గ్రామ సభలు
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజా నరసింహ

భూత్పూర్ జనవరి 22 (మనం న్యూస్):ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ అన్నారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండల పరిధిలోని గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందే విధంగా ప్రజల వద్దకే గ్రామసభలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డులు ఇవ్వని దుస్థితి వారిదన్నారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవచ్చు అన్నారు ప్రజలతో మమేకం కావడానికి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి వాస్తవ పరిస్థితులను గుర్తించడానికి ఇలాంటి గ్రామసభలు ఉపయోగపడతాయని తెలిపారు ప్రభుత్వ పథకాలకు గతంలో దరఖాస్తు చేసుకొని వారికి, దరఖాస్తు చేసుకున్న పేరు రానివారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తున్నామని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత పది సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు కూడా గత ప్రభుత్వం పేదలకు ఇవ్వలేదని కానీ ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నామని ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని ఆయన చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు... ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

అరులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టుకుంటూ ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. అధికారం చేపట్టిన రెండు రోజులకే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ తదితర హామీలు నెరవేర్చమని, రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామన్నారు. జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా ఎస్పీ డి. జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎంపీడీవో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ డాక్టర్ కదిరి శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, హర్యానాయక్, గోవర్ధన్ గౌడ్, అన్వర్ పాషా, సంజీవరెడ్డి, మాస గౌడ్, రావులపల్లి నర్సింలు, కప్పేట వడ్డే శ్రీను, జైదు శ్రీను తోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డ్ ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన నిరుపేదలకి ఇందిరమ్మ గృహాలు
- 26 వరకు 9 సంక్షేమ పథకాలు అమలుకు కృషి
- 15 కోట్ల రూపాయలతో మున్సిపల్ అభివృద్ధి
- ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్, జనవరి 22 (మనం న్యూస్): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులలో బుధవారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా వార్డు సభకు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లు మాఫీ, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేశామని అదేవిధంగా రెండవ సంవత్సరం ప్రారంభంలోనే మరో నాలుగు నూతన సంక్షేమ పథకాల అమలుకు కార్యచరణ చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా మార్గదర్శకాలు ప్రకారం వ్యవసాయ భూమి లేని కుటుంబాలను గుర్తించామని వీరికి సంవత్సరానికి 12 వేల రూపాయలను రెండు విడుతలలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని దీనికి సంబంధించిన జాబితా గ్రామాలలో ప్రదర్శిస్తామని, ఏదైనా అభ్యంతరాలు ఉన్నా, ఇంకా ఎవరైన అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని వాటిని కూడా పరిశీలించి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఉగాది నుండి ప్రతి తెల్ల రేషన్ కార్డు దారుడికి 6 కిలోల సన్న బియ్యం అందిస్తామని పేర్కొన్నారు. సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చామని ఒక్కొక్క రైతుకి ఒక ఎకరంకు 10 నుండి 12 వేల రూపాయలు బోనస్ వచ్చిందన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలే లేవని తెలిపారు. నిరుపేదకు 5 లక్షల రూపాయల ఇందిరమ్మ గృహాన్ని అందించడమే లక్ష్యమన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో 15 వేల ఇల్లు ఇచ్చి తీరుదామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దళిత బంధు పేరుత డబ్బులు వసూలు చేసిన నాయకులు ఉన్నారని తమ ప్రభుత్వంలో ఏ ఒక్కరు సంక్షేమ పథకాలకు డబ్బులు అడిగే వారే లేరని ఎవరు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ వరకు 9 సంక్షేమ పథకాలు అమలు పరుస్తామని పేర్కొన్నారు. 54 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వం దేనిని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో కోటి రూపాయల పనులు చేపట్టామని త్వరలో మరో 15 కోట్ల రూపాయల పనులను చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఒక కోటిన్నర రూపాయలతో పూసల రోడ్డు సెంట్రల్ లైటింగ్ త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. అమృత క్రింద 18 కోట్ల రూపాయలతో మంచినీటి పథకానికి టెండర్ పిలిచి త్వరలోనే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వార్డు సభలో అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. జాబితాలో పేరు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అబ్బయ్య గౌడ్, పార్టీ శ్రేణులు సాయిరి మహేందర్, ఆరెపల్లి రాజేందర్, సిద్ధ తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, సయ్యద్ మస్రత్, వలస నీలయ్య, ముత్యాల రవీందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంపీడీఓ లతో పాటు అధికారులు లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకూ ప్రభుత్వ పథకాలు
- రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియ
- పంట వేసినా, వేయకున్నా రైతు భరోసా
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో,జనవరి22(మనంన్యూస్): అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాలు అందుతాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా తిమ్మాపూర్ మండలం రేణికుంటలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసిందని అన్నారు. ఎంతమందికి అర్హత ఉంటే అంతమందికీ రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. పెళ్లయిన వారికి విడిగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల మార్పు చేర్పులు అన్ని పూర్తి చేస్తామని అన్నారు. గతంలో మీసేవ, ప్రజావాణి, సర్వేలలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తామని, అర్హత ఉన్న వారందరికీ కార్డు ఇస్తామని అన్నారు. గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు లేకున్నా అదే సభలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. 2014లో 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే గత పది సంవత్సరాలలో కేవలం 40 వేల మందికి మాత్రమే రేషన్ కార్డు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం 40 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇస్తుందని అన్నారు. అందరికీ రేషన్ కార్డు అందిన తర్వాత ప్రతి వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్లందరికీ ఇల్లు కట్టించే ప్రక్రియ చేపట్టామని, ఇండ్ల మంజూరు జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. స్వంతస్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నామని, ఎస్సీ ఎస్టీలకు మరో లక్ష ఆదనంగా ఇస్తామని తెలిపారు. సాగు చేసేందుకు యోగ్యంగా ఉన్న ప్రతి ఎకరానికి సంవత్సరానికి 12 వేలు రైతు భరోసా ఇవ్వబోతున్నామని తెలిపారు. పంట వేసినా వేయకున్నా వ్యవసాయానికి ముఖ్యంగా ఉంటే రైతు భరోసా అందుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 12,000 అందజేస్తున్నామని అన్నారు. ఈ స్థాయిలో ఇన్ని ప్రభుత్వ పథకాలు ఒకేసారి అమలు చేయడం చరిత్రలో ఎక్కడా లేదని తెలిపారు. మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని అన్నారు. గతంలో ప్రజా పాలన సమయంలో దరఖాస్తు ఫారం సరిగ్గా నింపకపోవడం వల్ల ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామసభ పూర్తయిన తర్వాత కూడా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వవచ్చని అన్నారు. అన్ని దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

బుధాల్ గ్రామంలో నిషేధాజ్ఞలు

జమ్ము-కశ్మీర్, జనవరి 22: జమ్ము-కశ్మీర్ రాష్ట్రం రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలోనే మూడు కుటుంబాల్లో ఏకంగా 17మంది అనుమానాస్పద రీతిలో ప్రాణాలు

కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ అంతుచిక్కని మరణాలతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మంగళవారం ఈ గ్రామానికే చెందిన ఐజాజ్ అహ్మద్ అనే 24 ఏళ్ల వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏంటో తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగా అధికారులు ఆ గ్రామాన్ని కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించారు. ఇకపై గ్రామంలోకి ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు సమావేశాలు, సమావేశాలు జరపకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రాతపూర్వక ఆదేశాలు జారీ చేసే అధికారం మేజిస్ట్రేట్లకు ఉందని అధికారులు పేర్కొన్నారు. అంతుచిక్కని ప్రమాదాలు లేదా వైరసును నివారించేందుకు ఈ ఆర్డర్లు కొంతమేర సహాయపడతాయని అన్నారు. రాజౌరీ జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రాజీవ్ కుమార్ ఖజురియా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గ్రామాన్ని మూడు కంటైన్మెంట్ జోన్లుగా విభజించారు. కంటైన్మెంట్ జోన్ 1- మరణాలు సంభవించిన అన్ని కుటుంబాలను కవర్ చేస్తుంది. బాధిత కుటుంబాల నివాసాలను సీల్ చేస్తారు. కంటైన్మెంట్ జోన్2- బాధిత కుటుంబాల సన్నిహితులుగా గుర్తించిన అన్ని కుటుంబాలఆరోగ్య పరిస్థితులను వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. కంటైన్మెంట్ జోన్3 - గ్రామంలో ప్రజలు ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. లాగ్ బుక్‌ల నిర్వహణవంటి అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

అయితే బాధిత కుటుంబాలు, వారి సన్నిహితులు ప్రభుత్వ అధికారులు అందించే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని..వారి ఇళ్లలో ఉన్న ఇతర పదార్థాలను వినియోగించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత కుటుంబాల ఇళ్లలో ఉన్న తినదగిన పదార్థాలు అన్నిటినీ స్వాధీనం చేసుకొని పరీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది. జమ్మూకశ్మీర్లోని రాజౌరీని అంతుచిక్కని మరణాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలోనే మూడు కుటుంబాల్లో ఏకంగా 17మంది అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని ప్రాథమికంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని.... మంగళవారం జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా బాధిత కుటుంబాలను కలిసి సానుభూతి తెలియజేసేందుకు ఆ గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ మరణాల వెనుక ఉన్న మిస్టరీ ఏంటో తెలుసుకొనేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అన్ని ప్రశ్నలకు త్వరలోనే సమాధానం దొరుకుతుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

ఆరోగ్య శాఖలో ఆప్ అవినీతి: కాంగ్రెస్

ఢిల్లీ,జనవరి 22: దేశరాజధానిలోని ఆమ్‌ఆద్మీ పార్టీ సర్కారుపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఆరోగ్యశాఖలో ఆప్ సర్కారు రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లీకైన నివేదికలోని వ్యత్యాసాలను పేర్కొంటూ..ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ 14 కాగ్ నివేదికలు చూపుతున్నాయని తెలిపారు.

అవినీతిపై పోరాటం చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారని దుయ్యబట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక పేర్కొందని అన్నారు. అప్ నేతలు తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయో అని అసెంబ్లీలో నివేదికలు ప్రవేశపెట్టకుండా నిలిపివేస్తున్నారని ఆరోపించారు.

కొవిడ్ మహమ్మారి సమయంలో కేంద్రం మంజూరు చేసిన నిధులలో 56 శాతం నిధులను ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి వినియోగించుకోవడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆసుపత్రుల్లో రోగుల కోసం పడకలను పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఆసుపత్రుల్లో పడకలు, ఇతర సౌకర్యాలను కాగ్ తనిఖీ చేసిందనీ..సిబ్బంది కొరత కూడా ఉన్నట్లు గుర్తించిందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల కోసం కేటాయించిన 14 ప్లాట్లను ప్రభుత్వం

అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.

గత పదేళ్లలో దేశరాజధానిలో కేవలం మూడు ఆసుపత్రులు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. అవి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో శంకుస్థాపన చేసినవని తెలిపారు. ఇందిరాగాంధీ ఆస్పత్రి నిర్మాణానికి టెండర్ కంటే రూ.314 కోట్లు అధికంగా ఖర్చు చేశారని.. అదేవిధంగా బురారీ ఆస్పత్రికి రూ.41 కోట్లు, మౌలానా ఆజాద్ డెంటల్ ఆస్పత్రికి రూ.26 కోట్లు అదనంగా ఖర్చు చేశారని మాకెన్ తెలిపారు.

ఆప్ మోసాలకు 'శీష్ మహల్' ఉదాహరణ

● ప్రధాని మోదీ

ఢిల్లీ, జనవరి 22: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ''ఢిల్లీలో ఆప్ పార్టీకి ఓటమి తప్పదు. అది తెలిసే రోజుకో హామీ ఇస్తోంది. ఆ పార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది. దీనిపై అధికార పార్టీని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆప్ మోసాలకు శీష్ మహల్ ఒక ఉదాహరణ. ఢిల్లీ ఎన్నికల్లో కార్యకర్తల వల్లే బీజేపీకి విజయం దక్కుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 50 శాతం ఓట్లు బీజేపీకి పడేలా కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలి'' అని ప్రధాని మోదీ సూచించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆప్, బీజేపీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. దీంతో ఢిల్లీ రాజకీయా వాతావరణం వేడెక్కింది.ఢిల్లీప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే కేజ్రీవాల్ తన కోసం 'శీష్ మహల్' (అద్దాల మేడ) నిర్మించుకున్నారని కొద్ది రోజులుగా బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

ట్రంప్ గ్రీన్ సిగ్నల్.. చైనాకు ఫిబ్రవరి ఫియర్

వాషింగ్టన్, జనవరి 22: అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్ ట్రంప్ వచ్చీ రాగానే సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సుంకాల విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికోలపై అదనపు టారీఫ్‌లు విధించేలా ఆదేశాలను ఇస్తానని ప్రకటించిన ఆయన.. తాజాగా చైనా పైనా గురిపెట్టారు. త్వరలోనే దానిపై సుంకాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. డ్రాగన్‌కు ఇప్పుడు ఫిబ్రవరి భయం పట్టుకుంది. ''ఫెంటనిల్ డ్రగ్‌ను చైనా వివిధ మార్గాల్లో మెక్సికో, కెనడాకు తరలిస్తోందన్నది వాస్తవం. దాని ఆధారంగానే ఆ దేశంపై 10శాతం అదనపు సుంకాలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఈ విషయంపై మా బృందంతో చర్చలు జరిపాం. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి వీటిని అమలు చేయాలని భావిస్తున్నాం'' అని ట్రంప్ ప్రకటించారు. ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ , ఒరాకిల్ సీటీవో ల్యారీ ఎల్లిసన్, సాఫ్ట్‌బ్యాంకు సీఈఓ మసయోషి సన్‌తో కలిసి వైట్‌హౌస్‌లో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో కొత్త అధ్యక్షుడు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో గతవారం జరిపిన సంభాషణను ట్రంప్ ప్రస్తావించారు. అయితే, ఆ సమయంలో టారిఫ్ల గురించి తాను పెద్దగా చర్చించలేదని పేర్కొన్నారు. ''డ్రగ్స్ వ్యాపారం చేసే వారికి మరణశిక్ష విధించాలని జిన్‌పింగ్ భావిస్తున్నారు. అది అమలైతే మెక్సికో, కెనడా తదితర దేశాలకు వారు ఫెంటనిల్ సరఫరా చేయలేరు. అప్పుడు అది అమెరికాలోకి రాలేదు. దీని గురించి చైనా అధ్యక్షుడితో చర్చించాలని అనుకుంటున్నా'' అని వివరించారు.

ట్రంప్ వాణిజ్య యుద్ధం..

తమ దేశ దిగుమతులపై అదనపు సుంకాలు విధిస్తే ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కెనడా, మెక్సికోలపై 25 శాతం అదనపు సుంకాలు అమలవుతాయని అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం ట్రంప్ ప్రకటించారు. దీనిపై ట్రూడోతో పాటు కెనడాలోని ఆటోమొబైల్‌కు హబ్ అయిన ఒంటారియో ప్రీమియర్ డాగ్ ఫోర్డ్ ఘాటుగా స్పందించారు. 'ట్రంప్ కెనడాపై అదనపు సుంకాలు విధించాలని నిర్ణయించుకుంటే.. దానికి గట్టిగా ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. డాలర్‌కు డాలర్ అనే నినాదానికి నేను మద్దతిస్తున్నాను. అవసరమైతే ప్రతీకారం తీర్చుకుంటాం' అని ట్రూడో హెచ్చరించారు. ట్రంప్ టారీఫ్‌ల ప్రకటనతో నూటికి నూరుశాతం వాణిజ్య యుద్ధం రాబోతుందని డాగ్ ఫోర్డ్ వ్యాఖ్యానించారు. వాటిని ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సంజయ్ రాయ్‌కు మరణశిక్ష పడేలా అప్పీల్: సీబీఐ

ఢిల్లీ,జనవరి 22: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కు సియాల్దా కోర్టు విధించిన శిక్షపై సీబీఐ అప్పీల్‌కు వెళ్లనుంది. విధుల్లో ఉన్న వైద్యురాలిపై పాశవికంగా దాడికి పాల్పడిన ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పుపై కోలకతా హైకోర్టులో అప్పీల్ చేసేందుకు సిద్ధమైంది. ఈ కేసు అత్యంత అరుదైన నేరం కేటగిరీలోకి వస్తుందని, మరణశిక్షకు అర్హమైనదేనంటూ సీబీఐకి న్యాయ సలహా అందడంతో.. దోషికి మరణ దండన విధించాలని హైకోర్టును కోరనుంది. కింది కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సవివరమైన వాదనలతో శుక్రవారం నాటికి అప్పీల్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సీబీఐ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ కేసుపై సోమవారం తీర్పు వెలువరించిన సమయంలో సియాల్దా అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి అనిర్బన్ దాస్ మాట్లాడుతూ.. సంజయ్ రాయ్‌కు సీబీఐ మరణశిక్ష విధించాలని కోరిందన్నారు. అయితే, డిఫెన్స్ న్యాయవాది మరణ దండనకు బదులుగా జైలు శిక్ష విధించాలని అభ్యర్థించారన్నారు. ఈ నేరం అత్యంత అరుదైన నేరం కేటగిరీలోకి రాదని పేర్కొన్న ఆయన.. దోషికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

పనామా కాలువ.. గిఫ్ట్ కాదు జోస్ రౌల్ ములినో

దావోస్, జనవరి 22: పనామా కాలువ తమదేనంటూ గత కొన్ని రోజులుగా వ్యాఖ్యానిస్తున్న డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తన ప్రమాణస్వీకారం సమయంలోనూ దీని గురించి ప్రస్తావించారు. ఆ కాలువను తప్పకుండా వెనక్కి తీసుకుంటామని పునరుద్ఘాటించారు. దీనిపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తీవ్రంగా స్పందించారు. ఈ కాలువను అమెరికా తమకేం

బహుమతిగా ఇవ్వలేదని ఘాటుగా వ్యాఖ్యానించారు.

స్విట్జర్లాండ్లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ములినో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''పనామా కాలువపై ట్రంప్ చెప్పిన ప్రతి మాటను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఎందుకంటే అదంతా అవాస్తవం. ఆ కాలువ అమెరికా నుంచి మాకు రాయితీగానో.. బహుమతిగానో వచ్చింది కాదు. అది మాది. మాకు మాత్రమే సొంతం'' అని తెలిపారు.

గత సోమవారం జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ''పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోంది. మేం దాన్ని చైనాకు ఇవ్వలేదు. పనామాకు ఇచ్చాం. ఇప్పుడు దాన్ని వెనక్కి తీసుకుంటాం'' అని అన్నారు. ఈ వ్యాఖ్యలపైనే ములినో స్పందించారు. అంతేగాక, ఈ కాలువ విషయంలో చైనా ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇలాంటి ప్రకటనలతో పనామా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు.

ఈ కాలువను 1914లో అమెరికా నిర్మించింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు 1999 డిసెంబరులో దీన్ని పనామాకు ఇచ్చేసింది. అయితే, అమెరికా వాణిజ్య, నావికాదళ నౌకల నుంచి పనామా దేశం భారీగా ఫీజులు వసూలు చేస్తోందని.. వీటిని తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేశారు. లేదంటే ఆ కాలువను తిరిగి వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇరు దేశాల మధ్య వివాదం రాజుకుంది.

చర్చలకు రాకపోతే ఆంక్షలు తప్పవు: పుతిన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జనవరి 22: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో త్వరలో భేటీ అయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దాదాపు మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్‌లో విలేకరులకు వెల్లడించారు. ''యుద్ధం అనేది అసలు మొదలు కాకూడదు. నేను అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్‌లో సంక్షోభం వచ్చేది కాదు. రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు త్వరలో ముగింపు పలుకుతా. కీవ్‌లో శాంతి ఒప్పందంపై చర్చలకు రష్యా రాకపోతే.. ఆంక్షలు విధిస్తా. మాస్కో ఎప్పుడూ ఉక్రెయిన్‌ను ఆక్రమించేదికాదు. పుతిన్‌తో నాకు చాలా బలమైన అవగాహన ఉంది. చాలా తెలివైన వ్యక్తి. ఆయనకు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై గౌరవం లేదు. పుతిన్‌తో కలిసి

పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా కొనసాగిస్తారా అని ఓ విలేకరి ప్రశ్నించగా.. ట్రంప్ బదులిచ్చారు. 'మేము దానిని పరిశీలిస్తున్నాం. ఈ విషయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మాట్లాడుతున్నాం. శాంతి ఒప్పందం జరగాలని ఆయన బలంగా కోరుకుంటున్నారు' అని వ్యాఖ్యానించారు.

మణిపుర్‌లో మద్దతు ఉపసంహరణపై జేడీయూ యూటర్న్

ఇంఫాల్, జనవరి 22: మణిపుర్‌లో కీలక రాజకీయ పరిణామం జరిగింది. బీరెన్ సింగ్ సర్కార్‌కు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర యూనిట్ ప్రకటించగా.. అలాంటిదేమీ లేదంటూ జేడీయూ అధినాయకత్వం తోసిపుచ్చింది. ఈశాన్యరాష్ట్రం మణిపుర్‌లో రాజకీయంగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అక్కడి భాజపా సర్కార్‌కు జేడీయూ షాక్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నీతీశ్‌కుమార్ నేతృత్వంలోని ఈ పార్టీ మద్దతు ఉపసంహరించుకుంది. మణిపుర్‌లో జేడీయూ పార్టీ అధ్యక్షుడు క్షేత్రమయుం బీరెన్ సింగ్ ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. బీజేపీకు తమ మద్దతు ఉండదని వెల్లడించారు. తమకున్న ఒకే ఒక్క ఎమ్మెల్యే ఎండీ అబ్దుల్ నాసిర్ ప్రతిపక్షంలో ఉంటారని తెలిపారు. ఈ ప్రకటనను జేడీయూ అధినాయకత్వం తోసిపుచ్చింది. మణిపుర్‌లో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నామంటూ వచ్చిన వార్తలను జేడీయూ తోసిపుచ్చింది. అవన్నీ నిరాధారమని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ వెల్లడించారు. అది క్షేత్రమయుం బీరెన్ సింగ్ తన సొంతంగా చేసిన ప్రకటన అని, ఆయన జాతీయ నాయకత్వాన్ని సంప్రదించలేదని తెలిపారు. దీనిని క్రమశిక్షణారాహిత్య చర్యగా భావించి, ఆయన్ను పదవి నుంచి తప్పించినట్లు వెల్లడించారు. మణిపుర్‌లో 2022లో జరిగిన ఎన్నికల్లో జేడీయూ 6 స్థానాల్లో విజయం సాధించింది. అయితే ఎన్నికలు జరిగిన కొద్దినెలల్లోనే ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరిపోయారు. 60 స్థానాలున్న మణిపుర్ అసెంబ్లీలో బీజేపీకి 37 మంది సభ్యులున్నారు. నాగా పీపుల్స్ ఫ్రంట్ నుంచి ఐదుగురు, స్వతంత్రులు ముగ్గురి మద్దతు ఉంది. దీంతో ఇప్పుడు ఎన్.బీరెన్ సింగ్ నేతృత్వంలోని సర్కారుకు ఎలాంటి ఢోకా లేదు. కానీ కేంద్రం, బిహార్‌లో ఎన్డీయే కూటమిలో కీలక పక్షమైన నీతీశ్ పార్టీ మద్దతు ఉపసంహరించుకోవడం, కాసేపటికే అధినాయకత్వం నిర్ణయం కాదంటూ వివరణ ఇవ్వడం గందరగోళానికి గురిచేసింది.

ఇంటి ముందే హెజ్బొల్లా కమాండర్ హత్య..!

లెబనాన్, జనవరి 22:హెజ్‌బొల్లా సీనియర్ కమాండర్ షేక్ ముహమ్మద్ అలీ హమాదీ దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనను కాల్చి చంపారు. తూర్పు లెబనాన్లో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు ప్రచురించింది. ముహమ్మద్ అలీ హెజ్‌బొల్లా అల్-బఖా రీజియన్‌కు కమాండర్‌గా వ్యవహరించాడు. తన నివాసం బయటే ఉన్న ఆయనపై రెండు వాహనాల్లో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా అప్పటికే కన్నుమూసినట్టు వైద్యులు వెల్లడించారు. అయితే.. కొన్నేళ్లుగా కొనసాగుతున్న కుటుంబ కలహాల కారణంగానే ఆయనపై ఈ దాడి జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ, ముహమ్మద్ అలీ మృతికి కారణం ఎవరో అనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. షేక్ ముహమ్మద్ అలీ హమాదీ ఎఫ్‌బిఐ మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్నాడు. 1985లో 153 మంది ప్రయాణికులతో ఉన్న వెస్ట్ జర్మన్ విమానాన్ని హైజాక్ చేసిన వారిలో ఇతడు కీలకంగా వ్యవహరించాడు. ప్రయాణికుల్లో ఉన్న అమెరికా జాతీయుడిని చిత్రహింసలకు గురిచేయడంతో చనిపోయాడు. దీంతో అతడిని ఎఫ్‌బిఐ వాంటెడ్ లిస్టులో చేర్చింది.

ఆ యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరు: చైనా

బీజింగ్, జనవరి 22: బీజింగ్ నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ 10శాతం టారీఫ్ విధిస్తానన్నడంపై చైనా స్పందించింది. తమ ప్రయోజనాలు ఎలా కాపాడుకోవాలో తెలుసని పేర్కొంది.

మాదక ద్రవ్యాలను అమెరికాలోకి చొప్పిస్తోందనే ఆరోపణలతో చైనాపై 10శాతం టారీఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. తాజాగా దీనిపై చైనా కూడా స్పందించింది. ఆ దేశ విదేశాంగశాఖ స్పందిస్తూ జాతీయ ప్రయోజనాలను తమ దేశం కాపాడుకోగలదని పేర్కొంది. ''వాణిజ్య లేదా సుంకాల యుద్ధంలో విజేతలు ఎవరూ ఉండరని మేము బలంగా విశ్వసిస్తాం. ఇక మా దేశ ప్రయోజనాలకు కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నాం'' అని చైనా ప్రతినిధి మావో నింగ్ వెల్లడించారు. అంతకు ముందు చైనా వైస్ ప్రీమియర్ డింగ్ ఝుజియాంగ్ కూడా ఇలానే స్పందించారు. రక్షణాత్మక వైఖరి ఎప్పటికీ మార్గం చూపదు.. వాణిజ్య యుద్ధంలో విజేతలు లేరు'' అని పేర్కొన్నారు. ఆయన వరల్ ఎకనామిక్ ఫోరంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్ సుంకాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికోలపై అదనపు టారీఫ్‌లు

విధిస్తామని ప్రకటించారు. తాజాగా చైనాను సైతం వదల్లేదు. ''ఫెంటనిల్ డ్రగ్‌ను చైనా వివిధ మార్గాల్లో మెక్సికో, కెనడాకు తరలిస్తోందన్నది వాస్తవం. దాని ఆధారంగానే ఆ దేశంపై 10శాతం అదనపు సుంకాలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి వీటిని అమలు చేయాలని భావిస్తున్నాం'' అని ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో గతవారం జరిపిన సంభాషణను ట్రంప్ ప్రస్తావించారు. డ్రగ్స్ వ్యాపారం చేసే వారికి మరణశిక్ష విధించాలని జిన్‌పింగ్ భావిస్తున్నారన్నారు. అది అమలైతే మెక్సికో, కెనడా తదితర దేశాలకు వారు ఫెంటనిల్ సరఫరా చేయలేరని తెలిపారు.

రికార్డు స్థాయిలో మంచు.. 2100 విమానాలు రద్దు

ఫ్లోరిడా, జనవరి 22: అమెరికాలోని పెన్సకోలా ప్రాంతంలో 5-12 అంగుళాల మేరకు రికార్డు స్థాయిలో మంచు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. అమెరికా దక్షిణ భాగంపై శీతాకాల తుపాను భారీగా

విరుచుకుపడుతోంది. ఫ్లోరిడాలోని పెన్సకోలా ప్రాంతంలో 5-12 అంగుళాల మందాన రికార్డు స్థాయిలో మంచు కురుస్తున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. 1989 తర్వాత ఇదే అత్యధికం అని పేర్కొంది. మంచు తుపాను కారణంగా అమెరికా వ్యాప్తంగా 2100 విమాన సర్వీసులు రద్దు చేశామని అధికారులు అన్నారు. టెక్సాస్, లూసియానా, మిసిసిపి, అలబామా, జార్జియా, సౌత్ కరోలినా, ఫ్లోరిడా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 10 అంగుళాల తీవ్రతతో మంచు కురుస్తున్నట్లు వెల్లడించారు.

దట్టమైన మంచు కురుస్తుండటంతో న్యూయార్క్, జార్జియాలతోపాటు పలు రాష్ట్రాల్లో గవర్నర్లు ఎమర్జెన్సీని ప్రకటించారు. రోడ్లపై దట్టంగా మంచు పేరుకుపోవడం వల్ల వాహనాలు నిలిచిపోయాయి. విపరీతమైన చలి కారణంగా టెక్సాస్, జార్జియా, మిల్వాకీలలో నలుగురు మరణించినట్లు ఏబీసీ న్యూస్ వెల్లడించింది.

లూసియానాలోని న్యూ ఆర్లీన్స్ చుట్టూ మంచు తుఫాను తీవ్రత అధికంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూసివేశామన్నారు. లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు రోజురోజుకు తీవ్రంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దట్టమైన హిమపాతం కారణంగా ప్రజలు అత్యవసరం అయితే తప్ప రోడ్డుపైకి రావద్దని సూచించారు. ఆర్కిటిక్ వైపు నుంచి వీస్తున్న అతిశీతల వాయువుల వల్ల అమెరికా తూర్పు తీరంపై మంచు దట్టంగా పరుచుకుంటోందని వాతావరణ శాఖ వెల్లడించింది.

పెళ్లు విరిసిన...పేదల ఆగ్రహం

- అనర్హులకు సంక్షేమ పథకాలు ఎలా జాబితా వర్తింపు
- ప్రభుత్వ అధికారులు తీరుపై మండిపడుతున్నప్రజలు
- రెక్క ఆడితే డొక్కాడని కుటుంబాల పై వివక్ష
- వార్డు సభలోని మున్సిపల్ అధికారులు నిలదీసిన వైనం
- 22 వ వార్డు మందుల వాడలో మంటలు రేపుతున్న అభ్యర్థుల జాబితా
- ఇదేమని నిలదీస్తే పోలీస్ ప్రహారాలో సభ నిర్వహణ

సూర్యాపేట జనవరి 22 (మనం ప్రతినిధి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రామ వార్డుల సభ రస భాషగా మారుతుంది ఇదేమని ప్రశ్నిస్తే పోలీస్ ప్రహార నడుమ భయభ్రాంతులకు గురి చేస్తూ సభను నిర్వహిస్తున్నారని కొంతమంది స్థానిక జనం ఆరోపణలు గుప్పిస్తున్నారు.. వివరాలకు వెళ్తే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కడు పేదలు ఎన్నో తరాలుగా ఎక్కువగా నివసించే.. 22వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన వార్డు సభ గందరగోళంగా మారింది. ప్రభుత్వం నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని అమలు చేసే సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు దక్కకుండా ఆర్థికంగా అంగ బలం అర్థబలం రాజకీయ బలం ఉపయోగించి పేర్ల నమోదు చేసుకున్నారని అక్కడ స్థానిక ప్రజలు లబోదిబోమంటున్నారు అర్హుల జాబితాను ప్రకటించిన క్రమంలో ఏ ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకం అందలేదని స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు అంతేకాకుండా అక్కడే అధికారులు నిలదీశారు అనర్హులకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు ఏడాది కాలంలో మూడు మూడుసార్లు దరఖాస్తు చేసుకున్న వాటిని బేకాతరు చేసి చెత్తకుప్పలో పడేసినట్టుగా అధికారుల తీరుందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజాపాలన కాదు, ఇది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలని అని గంట పదంగా విమర్శలు గుంపుమంటున్నాయి ముఖ్యంగా వార్డుల్లో ఉన్న మందుల వాడలో పేద ప్రజల గుండెలు మండేలా ప్రభుత్వం, అధికారులు తీరు ఉందని స్థానిక మందుల వాడలో ఉన్న కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన వార్డు సభ తీరు చూస్తే ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారు ఈ సభ అద్దం పడుతుంది.విచిత్రం ఏమిటంటే.. కనీసం సంక్షేమ పథక లకు దరఖాస్తు చేసుకొని కుటుంబాల పేర్లు లబ్ధిదారుల ఎంపిక జాబితాలో ఉండటం స్థానిక ప్రజల్ని విశ్వనాయానికి గురిచేస్తుంది.. ఇదేమని కొందరు సభలో ప్రశ్నిస్తే మాకేం తెలుసు అంటూ అధికారులు దాటవేత్త ధోరణి అవలంబిస్తుండటం గమనార్హం.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందాలి

పుర వైస్ చైర్మన్ పుట్ట కిషోర్

రోజువారి కూలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న 22వ వార్డు రాజీవ్ నగర్ ప్రజలని ఈ ప్రాంత పరిస్థితులు అధికారుల లెక్కల ప్రకారం ఎంతో మంది నిరుపేదలు జీవిస్తున్నారని ఇందులో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకం వర్తింపజేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో నిష్పస్స పాతంగా వ్యవహరించి నిరుపేదలకు సంక్షేమ పథకం అందేలా చూడవలసిన బాధ్యత అధికారులపై కచ్చితంగా ఉందని నిపుణులు చెప్తున్నారు అన్ని మీరు ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న వార్డు సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైంది.ఊరూరా తిరగబడుతున్న జనం ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే మీ ఏడాది పాలన విఫలమైందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహరా నడుమ వార్డ్ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణం అని పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు వార్డ్ సభలు నిర్వహిస్తుంటే మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు నాయకులు చెప్పడం సిగ్గుచేటు కదాఅలాంటపుడు వార్డ్ సభలు సమావేశాలు ఏర్పాటు ఎందుకు తూతూ మంత్రంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. వీటన్నిటిని చూస్తే అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లుగా కనపడుతుందని ఎన్నికల ముందు హామీలు ఇస్తాం అధికారంలోకి వచ్చాక ఎగ్గొడతాం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామాలలో రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులైన అందరికి ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు రైతులు పెద్ద ఎత్తున తిరగబడుతున్నారని గుర్తు చేశారు.కాంగ్రెస్ నాయకుల పాపం అధికారులకు శాపంగా మారింది. సమాధానం చెప్పలేని పరిస్థితి మీ పాలన మీరు నిర్వహిస్తున్న వార్డు సభలు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు దగా ఆరు గ్యారెంటీలు అమలు దగా రుణమాఫీ చేయడం దగా పంట బోనస్ ఇవ్వడం దగా రైతు భరోసా అమలు దగా రేషన్ కార్డుల జారీ దగా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా..ఏడాది కాలంలో మీరు చేసిన దగాను నయవంచనను ప్రజల కు అర్థమైందని. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తరు. అరెస్టులు చేసి గొంతు నొక్కేస్తున్నారని విమర్శించారు.నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ వస్తున్నారని. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయా లని ప్రభుత్వాన్ని బీ.ఆర్.ఎస్ పక్షాన డిమాండ్ చేశారు లేకుంటే పెద్ద ఎత్తున ఈ వార్డు నుండే ఉద్యమం మొదలు పెడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- రెండో రోజు సభల్లో అదనపు కలెక్టర్, కొత్వాల

పాల్వంచ, జనవరి 22(మనం న్యూస్) : ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యా చందన, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు లు అన్నారు.గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రెండో రోజు వార్డు సభలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా రెండవరోజు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గట్టాయిగూడెం, ప్రశాంతినగర్, కరకవాగు ప్రాంతాల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ..ఆరు గ్యారంటీల్లో ముఖ్యమైన రెండు లక్షల ఒకే దఫా రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్, ఉచిత విద్యుత్ వంటి పథకాలకు మంజూరు చేయించిందన్నారు. ఈ దఫా నాలుగు సంక్షేమ పథకాలు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు ఇంత మంచి పథకాలను ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలు మద్దతు తెలపాలని కొత్వాల కోరారు. కొత్వాలను సన్మానించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ సభల్లో పాల్గొంటున్న కొత్వాలను ఆయా ప్రాంతాల్లోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమీషనర్ కె సుజాత, మేనేజర్ ఎల్ వి సత్యనారాయణ, ఏ ఈ రాము, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, అడ్వకేట్ తుమ్మల శివారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మనోహర్, కాపర్తి వెంకటాచారి, కాపా శ్రీనివాసరావు, షఫి, వుండేటి శాంతివర్ధన్, భట్టు మురళి, రమణమూర్తి నాయుడు, వైఎస్ గిరి, భట్టు సురేష్, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- అర్హత ఉన్నప్రతి ఒక్కరూ రేషన్ కార్డు ఇందిరమ్మ ఇండ్లకు అప్లికేషన్ చేసుకోవాలి
- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్

నర్సంపేట జనవరి 23 (మనం న్యూస్): ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ కోరారు. పట్టణంలోని 22వ డివిజన్లో ఏర్పాటుచేసిన వార్డు సభ కార్యక్రమంలో వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు వస్తాయని లిస్టులో పేరు లేకపోయినప్పటికీ కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, లబ్ధిదారులు ఎవరు నిరాశ చెందొద్దని అన్నారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియగాకొనసాగుతుందని ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలలో ఒక ఇల్లు గాని రేషన్ కార్డు గాని ఇవ్వలేదని,ప్రజలు దరఖాస్తులు చేసుకుని విసిగి వేసారి పోయారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సర కాలంలోనే ఎన్నికల హామీల మేరకు పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ తాసిల్దార్ రాజేశ్వరరావు, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ జూలూరి కావ్య, వి గణేష్, జె స్రవంతి, కే తరుణ్,నాగరాజు,మైసి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ జాగిరి వెంకటేష్ గౌడ్

బోయిన్ పల్లి, జనవరి 22 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ జాగిరి వెంకటేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ముందుకు వెళుతుందని కానీ ప్రతిపక్షాలు అనవసరంగా ఇబ్బంది పెడుతూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. పదేళ్ల బి.ఆర్.ఎస్ పార్టీ పాలనలో ఒక్కనాడు కూడా ప్రజా సమస్యలపై గ్రామసభ నిర్వహించలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో రాష్ట్రం నియోజకవర్గం ముందుకు వెళుతుందని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

- దుబ్బాక అభివృద్ధిలో కౌన్సిలర్ల పాత్ర ఎనలేనిది
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక, జనవరి 22, మనం న్యూస్: దుబ్బాక పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున ఈ నెల 26తో పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్నందున మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో పాల్గొని కౌన్సిలర్లను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యేగా నా గెలుపు కోసం కౌన్సిలర్ల కృషి మరువలేనిదన్నారు. గతంలో ఎంపీగా పోటీ చేసినా, ఎమ్మెల్యేగా పోటీ చేసినా ముందుండి గెలిపించిన మీ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఆనాడు రామలింగారెడ్డి మీపై నమ్మకం ఉంచి కౌన్సిలర్ గా అవకాశం కల్పించారని, వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఏడాది కాలం గడుస్తున్నా రాష్ట్రంలో బి.ఆర్.ఎస్. ప్రభుత్వం లేక దుబ్బాకకు నిధులు రావడం లేదని, రానున్న నాలుగేళ్ల కాలంలో నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ అభివృద్ధికి తమవంతుగా తోడ్పాటును అందించాలని, ఈ ఐదేళ్ల కాలంలో దుబ్బాక అభివృద్ధికి కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దుబ్బాక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించిన పలువురు లబ్ధిదారులకు సీఎం.ఆర్.ఎఫ్. చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి కోసం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, లబ్దిదారులు తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేసి సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- గ్రామసభల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి
- జాబితాల్లో అనర్హుల పేర్లను ప్రకటించారంటూ సభల్లో గందరగోళం

చిగురుమామిడి, జనవరి 22 (మనం న్యూస్): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని, గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నవాబుపేట, ముదిమాణిక్యం, లంబాడిపల్లె, పీచుపల్లే తదితర గ్రామాల్లో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల తీరును వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రెండు లక్షల రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, తదితర ప్రజా సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ వస్తుందన్నారు. పలు గ్రామాల్లో గ్రామసభలు గందరగోళంగా మారాయి.అధికారులు ప్రకటించిన జాబితాలో అర్హుల పేర్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా పాలన సభల్లో దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్కరి పేరు కూడా జాబితాలో లేదని టిఆర్ఎస్ నాయకులు హనుమల్ల సత్యనారాయణ పిల్లి వేణులు తెలిపారు. ప్రజాపాలన అని చెప్పుకుంటూ పోలీస్ ప్రహారాలో గ్రామసభలు నిర్వహించడం ఏంటని వారు ప్రశ్నించారు. గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, ప్రభుత్వం అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షే పథకాలను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ రాజులు నాయుడు, ఐకెపి ఎపిఎం మట్టెల సంపత్, మండల ఆర్ ఐ విరాల అరుణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్, ఏఈఓ సాయికుమార్, నాయకులు చిట్టుమల్ల రవీందర్,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, కూతురు రవీందర్ రెడ్డి,ఠాకూర్ నరేందర్ సింగ్, హనుమండ్ల సత్యనారాయణ, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పిల్లి వేణు, ఎనగందుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు

బోయిన్‌పల్లి, జనవరి 22(మనం న్యూస్): బోయిన్ పల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నేతలు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిశారు. చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించిన సభకు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు నాగుల వంశీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించి అర్హులను చేర్చండి

- అధికారులతో ప్రజల వాగ్వాదం

సిద్దిపేట అర్బన్, జనవరి 22, మనం న్యూస్: అధికారులు ప్రవేశపెట్టిన జాబితాలలో అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలని ప్రజలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా జనవరి 26 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నాలుగు పథకాలలో భాగంగా గ్రామ సభలలో భాగంగా రెండవ రోజు సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి, పొన్నాల, బూరుగుపల్లి, కృష్ణ సాగర్ గ్రామాల్లో అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు గ్రామ సభలు ప్రారంభం కాగానే ప్రతి పథకంలో భాగంగా అర్హుల లిస్టులను అధికారులు చదువుతున్న సందర్భంలో అనర్హులు ఉన్నారంటూ, వారి పేర్లను జాబితాల నుండి తొలగించాలని పొన్నాల, మిట్టపల్లి గ్రామాల్లోని ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే జాబితా నుండి తొలగిస్తామని అన్నారు. ప్రభుత్వం అర్హులకే పథకాలు చేరాలి అన్న ఉద్దేశంతో పథకం ప్రవేశపెట్టిందని అర్హులకు అందే విధంగా గ్రామ సభలో తీసుకున్న నిర్ణయాలతో ముడిపడి ఉంటుందన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో భాగంగా వచ్చిన అధికారులు పథకాల ప్రకారంగా అర్హుల జాబితాను చదువుతుండగా గ్రామస్తులు ఒక్కసారిగా అధికారుల వైపు దూసుకెళ్లారు. దీంతో అధికారులు, గ్రామస్తుల మధ్య గందరగోళం జరగడంతో సభను ముగియకుండానే అర్ధాంతరంగా నిలిపివేశారు. అధికారులు సమస్యలపై పథకాల వివరణ పై ఎంత చెప్పినా గ్రామస్తులు వినకుండా అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సభ అర్ధాంతరంగానే ముగిసింది. అర్బన్ మండలంలోని గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులు, తహసిల్దార్ సలీం ఎంపీఓ వేణుగోపాల్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్, ఇందిరమ్మ కమిటీ మహిళా నాయకురాలు కవిత, పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య, నాయకులు యాదగిరి శ్రీనివాస్ బలరంగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గంగాజమున సంస్కృతికి నిదర్శనం

- **మాషూక్ రబ్బాని ఉర్సు ఉత్సవాలు**

ఈ రోజు సాయంత్రం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఉర్సులో నిర్వహించిన మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారు పాల్గొన్నారు. దర్గాకు చేరుకున్న మంత్రి గారికి దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ ఉబేద్ బాబాలు సాదర స్వాగతం పలికారు. మంత్రి గారికి సంప్రదాయం ప్రకారం దట్టీ కట్టి, చీరను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ గారు దర్గాలోని మాషుక్ రబ్బాని సమాధికి పుష్పాంజలి సమర్పించి, ప్రార్థన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, 500 ఏళ్ళ చరిత్ర వున్న మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలు తెలంగాణ గంగా జమున సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయని అన్నారు. ఎలాంటి సమస్యలున్నా ఈ దర్గాను దర్శిస్తే అన్ని బాధల నుంచి విముక్తి కలుగుతుందని ప్రజలు నమ్ముతారని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఎంతో అట్టహాసంగా జరిగే మాషుక్ రబ్బాని దర్గా ఉత్సవాల్లో పాల్గొనడం గొప్ప అనుభూతినిస్తున్నదని మంత్రి తెలిపారు.

దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ నవీద్ బాబా, సయ్యద్ షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ ఉబేద్ బాబాల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉర్సు (సంధల్) ఉత్సవాలను పెద్ద ఎత్తున చేపట్టడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మైనార్టీల పట్ల ముఖ్యంగా ముస్లింల అభ్యున్నతికి కట్టుబడి వున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్గా అభివృద్ధికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్ 1 కోటి 38 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన పనులతో దర్గా రూపురేఖలు మారనున్నాయని అన్నారు. వీటికి తోడు సీఎం రేవంత్ రెడ్డి గారు దర్గా అభివృద్ధికి ప్రకటించిన మరో కోటి రూపాయల నిధులతో యావత్ తెలంగాణలోనే మాషూక్ రబ్బాని దర్గాను అత్యంత గొప్పగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెనుకబాటుకు గురైన ముస్లిం పేద వర్గాలకు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- **అర్హత ఉన్నప్రతి ఒక్కరూ రేషన్ కార్డు ఇందిరమ్మ ఇండ్లకు అప్లికేషన్ చేసుకోవాలి**
- **మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్**

నర్సంపేట జనవరి 23 (మనం న్యూస్): ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ కోరారు. పట్టణంలోని 22వ డివిజన్లో ఏర్పాటుచేసిన వార్డు సభ కార్యక్రమంలో వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు వస్తాయని లిస్టులో పేరు లేకపోయినప్పటికీ కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని,

లబ్ధిదారులు ఎవరు నిరాశ చెందొద్దని అన్నారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియగాకొనసాగుతుందని ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలలో ఒక ఇల్లు గాని రేషన్ కార్డు గాని ఇవ్వలేదని,ప్రజలు దరఖాస్తులు చేసుకుని విసిగి వేసారి పోయారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సర కాలంలోనే ఎన్నికల హామీల మేరకు పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో, డిప్యూటీ తాసిల్దార్ రాజేశ్వరరావు, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ జూలూరి కావ్య, వి గణేష్, జె స్రవంతి, కే తరుణ్,నాగరాజు,మైసి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ల ఆచూకీ కోసం...

- **ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగ ఏర్పాటు**
- **రామగుండము పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ (ఐజి)**

మంచిర్యాల, జనవరి 22(మనం న్యూస్)ః పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ల ఆచూకీ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగ ఏర్పాటు చేయడమని, మొబైల్ ఫోన్ పోయిన, చోరికి గురైనా (డ బ్ల్యూడ బ్ల్యూడ బ్ల్యూ.సిఇఐఆర్.జిఓవి.ఐఎన్) క్లీయర్ అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలని రామగుండము పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి) అన్నారు. రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న, చోరికి గురైన 200 మొబైల్ ఫోన్లను సుమారు 25,68.997లక్షల విలువగల వాటిని బాధితులకు సిపి అందజేశారు.

రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెల్ ఫోన్ యజమానులు పోగొట్టుకున్న, దొంగలించబడిన సెల్ ఫోన్ ల స్వాధీనంకు సంబందించి సిపి ఆదేశాల మేరకు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ నేతృత్వంలో రామగుండము కమీషనరేట్ సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు స్వాదీనం చేసుకొన్న సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న, దొంగలించబడిన సెల్ ఫోన్ల ఆచూకీ కనుగొని పోలీస్ స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ల ను కమిషనర్ ఆ సెల్ ఫోన్ లను యజమానులకు అందజేశారు. సందర్భంగా సిపి మాట్లాడుతూ రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 5280 సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా ఇందులో ఇప్పటి వరకు 1538 సెల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందని, గత కొంతకాలంగా సిసిఎస్, ఐటి సెల్ పోలీసులు శ్రమించి మరో సుమారు 200 ల సెల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఫోన్ పోయిన లేదా దొంగిలించబడిన ఫోన్ లను వెతికి పెట్టడానికి కమీషనరేట్ పోలీస్ యంత్రాంగం పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ క్లీయర్ (సెంట్రల్ ఇక్యూప్‌మెన్ట్ ఐడెన్టిటి రిజిస్ట్రర్) అనే అప్లికేషన్ ద్వారా చరవాణి ఎక్కడైనా పోగొట్టుకున్న లేదా చోరికి గురైనా వెతికి పట్టుకోవడానికి ఎంతో చేయూతనిస్తుందని ఈ అప్లికేషన్ ముఖ్యంగా మొబైల్ ఫోన్ పోయినప్పుడు అట్టి మొబైల్ ఫోన్ పట్టుకోవాడానికి చాలా ఉపయోగపడుతుందని అన్నారు. క్లీయర్ పోర్టల్లో ఎంటర్ చేసిన ఫోన్ వివరాలు ఇతర రాష్ట్రాల్లో, ఇతర నెట్వర్క్‌లో ఉపయోగించగలగకుండా బ్లాక్ చేస్తుందని, దీంతో ఆ ఫోన్ వాడటం కష్టమవుతుంది. ఈ విధానం వల్ల చోరీలు తగ్గే అవకాశం ఉందన్నారు ఫోన్ యజమానులు తమ ఫోన్లు తిరిగి పొందినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితాలలో ఈ సాయాన్ని చాలా విలువైనదిగా అభివర్ణించారు. మొబైల్ ఫోన్ రికవరీలో పాల్గొన్న సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సిసిఎస్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ఎస్ఐ లు ఏ మధుసూదన్ రావు కే నరేష్, బి జీవన్, ఎం చంద్రశేఖర్, ఎం శివకేశవులు, ఎన్ శ్రీధర్, బి భూమన్న, ఎన్. శామ్యూల్ పాల్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ దేవేందర్, ప్రేమ్ సింగ్, సత్తయ్య, హేమ సుందర్, దేవేందర్, కానిస్టేబుల్స్ రాజమౌళి, విష్ణు, జి సతీష్, జయచంద్ర, బి శ్రీనివాస్, భరత్, ఐటీ సెల్ కోఆర్డినేటర్ కో- ఆర్డినేటర్ హెడ్ కానిస్టేబుల్ రాము, బి.రమేష్, వి. రాజేందర్ లను సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటి సెల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో అధికారులను ప్రశ్నించిన ప్రజలు

బోయిన్‌పల్లి, జనవరి 22(మనం న్యూస్)ః బోయిన్ పల్లి మండలంలోని అనంతపల్లి గ్రామంలో గ్రామ సభలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పథకాల అమలు తీరుపై గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు.

ప్రభుత్వం హామీ ఇచ్చి చాలా రోజులు గడుతున్నప్పటికీ ఇంతవరకు కొన్ని సమస్యలు ఇంకా నెరవేర్చలేదని అధికారులను అడిగారు. మండల అధికారులు వారిని సముదాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**
- **ధరఖాస్తు ఎప్పుడైనా చేసుకోవచ్చు.. నిరంతర ప్రక్రియ..**

పర్వతగిరి, జనవరి 22 ,మనం న్యూస్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులందరికీ వర్తిస్తాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ఇదో నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రజాపాలన గ్రామ సభను జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు స్థానిక ఎమ్మార్వో తాడబోయిన వెంకటస్వామి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా అమలు చేసే నాలుగు పథకాల కోసం తహసిల్దార్, ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయాలలో పేపర్, డెస్క్ వర్క్ పూర్తి చేసి గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.2024 సంవత్సరంలో నిర్వహించిన గ్రామ సభలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని, ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించడం జరిగిందని ఈ 26 నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్తగా నాలుగు పథకాలను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కొత్త పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేయని వారు తహసిల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని ప్రజా పాలన కేంద్రాలలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియ అని ఆమె తెలిపారు. దరఖాస్తులు చేయని వారు లీస్టులలో పేరు రానివారు గ్రామాలలో నాలుగు రోజులపాటు నిర్వహించే సభలలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పక్కా సమాచారంతో లబ్ధిదారుల ఎంపిక

- **వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక పక్కా సమాచారంతోనే చేసినట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం పర్వతగిరి మండలం గోపనపల్లి లో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పక్కా సమాచారం తో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో

ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి జడ్పి సీఈవో రాంరెడ్డి, తహశీల్దార్ వెంకట స్వామి ,జిల్లా పంచాయితీ అధికారి ,మరియు ప్రత్యేక అధికారి కల్పన సంబంధిత అధికారులు, పంచాయితీ సెక్రటరీ లు,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సొంత స్థలాలు ఉన్న వారితోపాటు, స్థలాలు లేని వారినీ సర్వే చేసి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా ఫోటోలు తీసుకున్న తర్వాత పరిశీలించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు వర్తిస్తుందని, భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయాన్ని భూభారతి రికార్డుల ప్రకారం ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ఎమ్మార్వో వెంకటస్వామి, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, సెక్రెటరీ, ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సురక్షిత భద్రత కోసం అభయ యాప్

- **ఆటోలకి క్యూఆర్ కోడ్ తో అనుసంధానం**
- **ప్రమాద భీమా పత్రాలు అందజేత**

సిరిసిల్ల, జనవరి 22 (మనం న్యూస్)ః జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ పట్టణంలోని ఆటోలకి అభయ క్యూర్ కోడ్ ఇన్సూరెన్స్ పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులకు ఆటోలో సురక్షితంగా ప్రయణిస్తున్నామనే నమ్మకం కలిగించాలిని అన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పరిమితి లోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలి అని అన్నారు. ప్రయాణికుల సురక్షిత, భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న ప్యాసింజర్ వాహనాలకు మొదటి దశలో 4000 వాహనాలకు అనుసంధానం చేయడం జరిగిందని, రెండవ దశలో కొత్తగా 800 వాహనాలకు అభయ యాప్ క్యూఆర్‌కోడ్ ని అనుసంధానం చేయడంతో పాటు అభయ యాప్‌తో వాహనాల డ్రైవర్లకు 50 రూపాయలతో యాక్సిడెంట్ డెత్‌కు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలకు అనునిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తారని, వారి రక్షణ దృష్ట్యా జిల్లాలో మొదట దశలో 4000 ప్యాసింజర్ వాహనాలకు అభయ యాప్ మై ఆటో మై ఆటో ఈజ్ సేఫ్ అనే క్యూఆర్‌కోడ్ అనుసంధానం చేయడంతో పాటు మరియు ప్రమాద భీమా అందించడం జరిగిందని, రెండవ దశలో జిల్లాలో కొత్తగా 800 వాహనాలకు క్యూఆర్ కోడ్ అనుసంధానం చేయడంతో పాటుగా అభయ యాప్ తో వాహనాల డ్రైవర్లకు 50 రూపాయలతో యాక్సిడెంట్ డెత్ కు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందని దీనిని ప్రతి సంవత్సరం 50 రూపాయలతో రిన్యువల్ చేసుకోవాలన్నారుప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆసురక్షితంగా భావించే ఏదైనా పరిస్థితిని సంఘటనలను ఎదుర్కొన్నపుడు ఆటోకి ముద్రించిన 'క్యూ అర్ కోడ్'ను స్కాన్ చేయాలని స్కాన్ చేయగానే వెంటనే డ్రైవర్ ఫోటో,వివరాలతో పాటుగా వాహనంకి సంబంధించిన వివరాలు వస్తాయి స్కాన్ చేసిన వ్యక్తి ఫోన్ నెంబర్ యాప్‌లో ఎంట్రీ చేసి ట్రేస్ ద లొకేషన్ అని ఎంట్రీ చేయగానే వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్, ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది ఆటోలో ఎక్కినప్పటి నుండి దిగేంతవరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా మానిటర్ చేయడం జరుగుతుంది. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని తగు రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అని అన్నారు ఆటోలో ఎక్కిన మహిళలు ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలి ఆటో డ్రైవర్ వివరాలు నెంబర్ తో యుక్తంగా వస్తాయి ఆటోలో ఏదైనా విలువైన వస్తువులు మరిచిపోతే వెంటనే ఆటోను ట్రేస్ అవుట్ చేసి అప్పగించడానికి వీలుంటుంది.గతంలో ఆటో డ్రైవర్ ఏదైనా పోలీస్ కేసులో ఇన్వాల్వ్మెంట్ అయి ఉంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే థిస్ ఆటో నాట్ సేఫ్ అనే రెడ్ సిగ్నల్ వస్తుంది ఇది ప్రయాణికులకు సేఫ్ జర్నీ చేయడానికి ఉపయోగపడుతుంది. ఆటో డ్రైవర్లు ఏదైనా నేరాలకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన సిసి కెమెరాల ద్వారా కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన,ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ చేసిన ఈ అప్ ద్వారా కంప్లైంట్.అదేవిదంగా ప్రయాణికులు వారు ప్రయాణిస్తున్న వాహనంకి రేటింగ్ కూడా ఇవ్వవచ్చు అన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ లు రాజు, రమేష్, అభయ యాప్ సృష్టి కర్త అభిచరన్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తొలి టీ20లో ఇంగ్లాండ్ పై భారత్ విజయం

ఇంగ్లాండ్ తో ఐదు టీ20ల సిరీస్ లో టీమ్ఇండియా కు అదిరే ఆరంభం! ఈడెన్ గార్డెన్స్ వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఇంగ్లాండ్ సరిగ్గా 20 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌటైంది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 12.5 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (79; 34 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతను 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సంజు శాంసన్ (26; 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (19*; 16 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2, ఆదిల్ రషీద్ ఒక వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో టీ20 చెన్నై వేదికగా శనివారం (జనవరి 25) జరగనుంది.

ఇంగ్లాండ్ బ్యాటర్లలో కెప్టెన్ జోస్ బట్లర్ (68; 44 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సు) ఒక్కడే రాణించాడు. హ్యారీ బ్రూక్ (17), జోఫ్రా ఆర్చర్ (12) పరుగులు చేశారు. ఫిల్ సాల్ట్, లివింగ్ స్టన్ డకౌట్ కాగా.. బెన్ డకెట్ (4), జాకబ్ బెతెల్ (7), జేమీ ఒవర్టన్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3, అర్ష్ దీప్ సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

రీ ఎంట్రీ ఇస్తా.. కాంపిటేటివ్ క్రికెట్ ఆడాలని ఉంది.. కానీ: డివిలియర్స్

2021 నవంబరులో డివిలియర్స్ అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి వైదొలిగాడు. ప్రస్తుతం తన సమయంలో ఎక్కువ భాగం కుటుంబానికి కేటాయించిన ఏబీడీ.. చారిటి, బ్రాడ్ కాస్టింగ్ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో మరోసారి తనకు 'రియల్ క్రికెట్' ఆడాలని ఉందంటూ అతడు వ్యాఖ్యానించడం విశేషం.

ఈ విషయం గురించి మెలిండా ఫారెల్‌కు చెందిన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ.. ''ఈరోజుకీ నేను క్రికెట్ ఆడగలననే నమ్మకంతో ఉన్నాను. అయితే, ఇప్పటి వరకు ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నా పిల్లలు మాత్రం నాపై ఒత్తిడి పెంచుతున్నారు. వాళ్లతో కలిసి నెట్స్ లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు నాలో మళ్లీ క్రికెట్ ఆడాలనే కోరిక కలిగింది.ఏదో ఓ చోట కాంపిటేటివ్ క్రికెట్ ఆడాలని భావిస్తున్నా. అయితే, నేను ఆర్సీబీ గురించి మాత్రం మాట్లాడటం లేదు. ఐపీఎల్ లేదంటే సౌతాఫ్రికా టీ20 లీగ్ లో మాత్రం పాల్గొనను. కేవలం నా పిల్లల కోసం, క్రికెట్ మీదున్న ప్రేమ కారణంగా మళ్లీ బరిలోకి దిగాలని భావిస్తున్నా. ఏదేమైనా మరోసారి ఒత్తిడిలోకి కూరుకుపోవాలని మాత్రం అనుకోవడం లేదు. కాస్త సరదాగా.. సంతృప్తికరంగా నా ఇన్నింగ్స్ ఉండాలని కోరుకుంటున్నా'' అని 40 ఏళ్ల ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.

తండ్రికి బైక్ గిఫ్ట్ ఇచ్చిన రింకూ సింగ్.. ధర ఎంతో తెలుసా?

టీమిండియా స్టార్ ప్లేయర్, కేకేఆర్ ఫినిషర్ రింకూ సింగ్ డౌన్ టు ఎర్త్ క్రికెటర్లలో ఒకడు. పేద కుటుంబం నుంచి వచ్చిన రింకూ సింగ్.. తనకు ఇష్టమైన ఆటకోసం ఎన్నో కష్టాలు పడ్డాడు. ఒకొనొక దశలో స్వీపర్ గా పనిచేసిన రింకూ.. ఇప్పుడు భారత టీ20 జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అయితే రింకూ సింగ్ విజయం వెనక అతడి తండ్రిది ఖన్ చంద్ర సింగ్ కీలక పాత్ర. ఖన్ చంద్ర సిలిండర్ల మోస్తే వచ్చే డబ్బుతో రింకూ క్రికెట్ ఆడేవాడు. అతడి సంపాదనతో కుటుంబం మొత్తం గడిచేది. అయితే తాజాగా రింకూ సింగ్ తన తండ్రిపై ప్రేమను చాటుకున్నాడు. తన తండ్రికి రింకూ ఖరీదైన నింజా స్పోర్ట్స్ బైక్ ను గిఫ్ట్ గా ఇచ్చాడు.

ఆ బైక్ ఖరీదు రూ. 3.19 లక్షలగా ఉన్నట్లు తెలుస్తోంది. నింజా స్పోర్ట్స్ బైక్ తో రింకూ తండ్రి అలీఘడ్ లో చక్కర్లు కొడుతున్నాడు. ఆ సిటీలోని చిన్న చిన్న వీధుల్లో అతను కవాసాకి నింజా బైక్ ను రైడ్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

కాగా తన తనయుడు స్టార్ క్రికెటర్ అయినప్పటికి.. ఖన్ చంద్ర ఇంకా వంటగ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే పనని వదలకపోవడం విశేషం. మరోవైపు రింకూ సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ ను పెళ్లి చేసుకోనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించారు. త్వరలోనే ఎంగేజ్మెంట్ జరిగే అవకాశముంది. కాగా రింకూ సింగ్ ప్రస్తుతం ఇంగ్లండ్ తో టీ20 సిరీస్ కు సిద్ధమవుతున్నాడు. బుధవారం జరగనున్న తొలి టీ20లో రింకూ ఆడనున్నాడు.

ఛాంపియన్స్ ట్రోఫీ 2025

ఫైనల్లో ఇంగ్లండ్ పై భారత్ ఘన విజయం

భారత దివ్యాంగ క్రికెట్ టీమ్ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 విజేతగా నిలిచింది. శ్రీలంకలో జరిగిన ఫైనల్లో భారత్ ఇంగ్లండ్ పై 79 పరుగుల తేడాతో గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 197 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఛేదనలో చేతులెత్తేసిన ఇంగ్లండ్ 118 పరుగులకే ఆలౌటైంది. భారత దివ్యాంగ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన విషయాన్ని భారత దివ్యాంగ క్రికెట్ కౌన్సిల్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. కృషి, దృఢ సంకల్పం మరియు నైపుణ్యం యొక్క అసాధారణ ప్రదర్శన అంటూ కామెంట్ చేసింది.

మెగా టోర్నీలో విక్రాంత్ కేనీ భారత జట్టును ముందుండి నడిపించాడు (కెప్టెన్గా). అద్భుతమైన జట్టును విజయపథంలో నడిపించడం నా కెరీర్కు గర్వకారణమని కేనీ అన్నాడు. ప్లేఆఫ్లో ప్రయాణం తమ జట్టులోని ప్రతిభ మరియు పోరాట స్ఫూర్తిని చూపిస్తుందని తెలిపాడు. జట్టులోని ప్రతి ఆటగాడు ఈ చారిత్రాత్మక విజయానికి దోహదపడ్డాడని పేర్కొన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ విజయం భారతదేశం తరపున క్రికెట్ ఆడాలని కలలు కన్న ప్రతి దివ్యాంగుడికి చెందుతుందని అని DCCI విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉటంకించారు.

ఫైనల్లో భారత ఆటగాడు యోగేంద్ర భదోరియా విధ్వంసం సృష్టించాడు. ఈ మ్యాచ్ లో అతను 40 బంతుల్లో నాలుగు బౌండరీలు, ఐదు సిక్సర్ల సాయంతో 73 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ లో భారత బౌలర్లు కూడా విశేషంగా రాణించారు. రాధికా ప్రసాద్ 3.2 ఓవర్లలో కేవలం 19 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. కెప్టెన్ విక్రాంత్ కేనీ 3 ఓవర్లలో 15 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర సంటే 4 ఓవర్లలో 24 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా విజయాన్ని జట్టు ప్రధాన కోచ్ రోహిత్ జలానీ కొనియాడాడు. తన జట్టు అసాధారణ ప్రదర్శన మరియు సన్నద్ధతను ప్రశంసించాడు. టోర్నీ ఆద్యాంతం తమ ఆటగాళ్లు అద్భుతంగా రాణించారని ఆకాశానికెత్తాడు. విభిన్న పరిస్థితుల్లో ఎదురైన ప్రతి సవాలును తమ ఆటగాళ్లు అధిగమించారని అన్నాడు.

టాప్‌లో బుమ్రా

జడేజా.. దిగజారిన రోహిత్ ర్యాంక్

ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్ లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా హవా కొనసాగుతున్నాడు. ఐసీసీ తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్ లో బుమ్రా 904 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25 సిరీస్ లో బుమ్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 5 టెస్టుల్లో 13.06 సగటుతో 32 వికెట్లు సాధించి ప్లేయర్ ఆఫ్ది సిరీస్ గా బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలోనే తన టెస్టు రేటింగ్ పాయింట్స్ను బుమ్రా మెరుగుపరుచుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ లో బుమ్రా తర్వాత స్థానాల్లో వరుసగా ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్(841), సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ(837) కొనసాగుతున్నారు.

మరోవైపు ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్ లో టీమిండియా స్టార్ ప్లేయర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. జడేజా ఖాతాలో ప్రస్తుతం 400 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో సిరీస్ లో జడేజా పర్వాలేదన్పించాడు. మిగితా ప్లేయర్లతో పోలిస్తే కాస్త మెరుగ్గానే కన్పించాడు.

ఈ సిరీస్ లో మొత్తం ఐదు మ్యాచ్ లు ఆడిన జడ్డా.. 27 సగటుతో 135 పరుగులు చేశాడు. జడేజా తర్వాత స్థానాల్లో ప్రోటీస్ ఆల్ రౌండర్ మార్కో జాన్సెన్ (294), బంగ్లా ప్లేయర్ మెహిదీ హసన్ (294) నిలిచారు. ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్ విషయానికి వస్తే.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ర్యాంక్ మరింత దిగజారింది. రోహిత్ ఒక స్థానం దిగజారి 43వ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. బీజీటీ సిరీస్ లో రోహిత్ తీవ్ర నిరాశపరిచాడు. కాగా బీజీటీ సిరీస్ లో రోహిత్ శర్మ తీవ్ర నిరాశపరిచాడు. అటు కెప్టెన్సీ, ఇటు బ్యాటింగ్ పరంగా రోహిత్ శర్మ పూర్తిగా తేలిపోయాడు. ఐదు ఇన్నింగ్స్ ల్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. రోహిత్ తన ఫామ్ ను తిరిగి పొందేందుకు పదేళ్ల తర్వాత రంజీల్లో ఆడనున్నాడు.

మనం మూవీ+ manammovie

ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి చాలా మంది టాప్ మోస్ట్ దర్శకుల్లో రామ్ గోపాల్ వర్మ ఎట్ చేసుకున్న

బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన వర్మ

యునిక్ నెస్ వేరే అని చెప్పాలి. ఇప్పుడు ఇండియన్ సినిమా దగ్గర అదరగొడుతున్న ఎంతోమంది దర్శకులకి తాను ప్రేరణగా నిలిచారు. కానీ క్రమేణా రామ్ గోపాల్ వర్మ ఎలాంటి సినిమాలు చేస్తూ వచ్చారో అందరికీ తెలిసిందే. అయితే రీసెంట్ గానే తన కల్ట్ క్లాసిక్ సినిమాల్లో ఒకటైన సత్య మళ్ళీ చూసేసరికి తనకి జ్ఞానోదయం అయ్యినట్టుగా చెప్పుకొచ్చి ఇక నుంచి మంచి సినిమాలే చేస్తానని తెలిపారు. ఇలా లేటెస్ట్ గా సత్య ఇన్సిడెంట్ తర్వాత భారీ ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేస్తున్నట్టుగా తాను తెలిపారు. ఒక్క మనిషి అత్యంత భయంకరమైన మృగంగా మారగలడు అంటూ ఒక సాలిడ్ లైన్ తో స్టార్ట్ చేసి సిండికేట్ అనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ని తాను అనౌన్స్ చేస్తున్నట్టుగా తెలిపారు. 1970ల దశకంలో జరిగే కథగా ఒక గ్యాంగ్ స్టర్ డ్రామా అన్నట్టుగా దీనిని కన్ఫర్మ్ చేశారు. అలాగే ఈ చిత్రం చాలా భయానకంగా ఎలాంటి అతీత శక్తుల ఎలిమెంట్స్ లేకుండా కేవలం మనిషి ఎంత భయంకరంగా భయపెట్టగలడు అనే కోణాన్ని చూపించగలడు అనేదే తన సినిమా సారాంశం అన్నట్టుగా వెల్లడి చేసారు. అలాగే సినిమా నటీనటులు ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తాను అని తెలిపారు.

మరి ఇదే మార్పు తన నుంచి తన ఫాలోవర్స్ ఎప్పుడు నుంచో కోరుకుంటున్నారు. మరి ఈ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ తో వర్మ కం బ్యాక్ ఇచ్చి మళ్ళీ ఇండియన్ సినిమాకి తానేంటో ప్రూవ్ చేస్తారో లేదో కాలమే నిర్ణయించాలి.

చరణ్ 16.. ఈ టైటిల్‌కి నో అంటున్న ఫ్యాన్స్!?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ, అంజలి హీరోయిన్స్ గా నటించిన లేటెస్ట్ చిత్రం గేమ్ ఛేంజర్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం తర్వాత చరణ్ యువ దర్శకుడు బుచ్చిబాబు సానాతో ఒక సాలిడ్ రూరల్ యాక్షన్ డ్రామా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆల్రెడీ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అయితే లేటెస్ట్ గా మళ్ళీ సినిమా టైటిల్ పై పలు రూమర్స్ మొదలయ్యాయి. ఎప్పుడు నుంచో ఉన్న టైటిలే పెద్ది ని మేకర్స్ లాక్ చేసేసారు అన్నట్టుగా మళ్ళీ రూమర్స్ మొదలయ్యాయి. నిజానికి ఈ టైటిల్ వేరే సినిమాకి బుచ్చిబాబు పెట్టుకున్నది అన్నట్టుగా టాక్. అలాగే ఆ సబ్జెక్టుకి ఇపుడు చరణ్ చేస్తున్న సబ్జెక్టుకి కూడా ఎలాంటి సంబంధం లేదనే తెలుస్తుంది. ఇక ఇపుడు వైరల్ అవుతున్న టైటిల్ కి అభిమానులు కూడా ససేమిరా నో అనే సోషల్ మీడియాలో చెబుతున్నారు. మరి మేకర్స్ ఈ చిత్రానికి ఏ టైటిల్ పెడతారు అనేది చూడాలి. ఇక ఈ భారీ సినిమాకి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా వృద్ధి సినిమాస్ అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

వీల్ ఛైర్‌లో రష్మిక

స్టార్ హీరోయిన్ రష్మిక ఇటీవల గాయపడిన విషయం తెలిసిందే. జిమ్ లో వర్కౌట్లు చేస్తుండగా ఆమె కాలికి గాయమైంది. తాజాగా ఆమె హైదరాబాద్ విమానాశ్రయంలో వీల్ ఛైర్ లో కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తన హిందీ చిత్రం ప్రచారంలో పాల్గొనడం కోసం ముంబయి బయల్దేరినట్లు తెలుస్తోంది. కారులో ఎయిర్పోర్ట్ కు చేరుకున్న రష్మిక తన టీమ్ సాయంతో వీల్ ఛైర్ లో విమానాశ్రయం లోపలికి వెళ్లారు. ఈ వీడియో చూసిన అభిమానులు ఆమె త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ పెడుతున్నారు. తనకు గాయమైనట్లు తెలుపుతూ ఇటీవల రష్మిక ఓ పోస్ట్ పెట్టారు. ''పూర్తిగా ఎప్పుడు కోలుకుంటానో ఆ భగవంతుడికే తెలియాలి. త్వరగా కోలుకుని 'సికందర్', 'థామ', 'కుబేర' సెట్స్ లో పాల్గొనాలని ఆశిస్తున్నా. ఈ ఆలస్యాన్ని క్షమించాలని ఆయా చిత్రాల దర్శకులను కోరుతున్నా. నా కాలు ఏమాత్రం సెట్ అయినా వెంటనే షూట్ లో భాగం అవుతా'' అని దానిలో తెలిపారు. ప్రస్తుతం రష్మిక 'ఛావా' తో బిజీగా ఉన్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. తెలుగులో 'కుబేర', 'ది గర్ల్ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతో అలరించనున్నారు.

బ్యాడ్ బాయ్ కార్తీక్‌గా నాగ శౌర్య.. ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నాగ శౌర్య హీరోగా కొంచెం గ్యాప్ తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ గ్యాప్ తర్వాత తాను హీరోగా మరో సినిమా చేస్తున్నట్టుగా రీసెంట్ గానే అనౌన్స్మెంట్ వచ్చింది. మరి ఫైనల్ గా ప్రాజెక్ట్ పై మేకర్స్ టైటిల్ సహా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ని తన బర్త్ డే కానుకగా రిలీజ్ చేసేసారు.

దర్శకుడు రమేష్ దేసిన తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి బ్యాడ్ బాయ్ కార్తీక్ అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ని అయితే ఫిక్స్ చేయగా ఇపుడు దీనిపై సాలిడ్ ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా వదిలారు. మరి ఈ పోస్టర్ లో నాగ శౌర్య చేతులకి రక్తం అలాగే నుదుట అదే రక్తంతో అడ్డబొట్టులా కూడా కనిపిస్తుంది. దీనితో ఈ సినిమా సాలిడ్ యాక్షన్ తోనే ఉండేలా ఉందని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు హరీష్ జైరాజ్ సంగీతం అందిస్తుండగా వైష్ణవి ఫిలమ్స్ తమ బ్యానర్ లో మొదటి సినిమాగా నిర్మాణం వహిస్తున్నారు.

అనుపమ 'పరద' కోసం వస్తున్న దుల్కర్



అందాల భామ అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పరద' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుంది. ఈ సినిమాను ప్రవీణ్ కండ్రేగుల డైరెక్ట్ చేస్తుండగా ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. ఇక ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ 'పరదా' మూవీ టీజర్ను జనవరి 22న గ్రాండ్ లాంచ్కు రెడీ చేశారు. అయితే, ఈ టీజర్ లాంచ్ను ప్రముఖ హీరో దుల్కర్ సల్మాన్ లాంచ్ చేయబోతున్నట్లు వెల్లడించారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.